RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 199 మేడ్చల్ మల్కాజ్‌గిరి 11 ఆగష్టు 2024 ఆదివారం పేజీలు : 4

## 'అగ్నివీర్'పై భారత నేవీ చీఫ్ ప్రశంసల జల్లు

భువనేశ్వర్ : అగ్నివీర్ పథకం దిగ్విజయంగా ముందుకు సాగుతుందని భారత నేవీ చీఫ్ ఆడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠీ వెల్లడించారు. ఒడిశాలోని ఐఎన్ఎస్ చిలుకలో అగ్నివీర్ నాల్గవ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మొదటి మూడు బ్యాచ్‌ల్లో 2,500 మంది శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరారని తెలిపారు. 2022లో అగ్నివీర్ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. ఆ సమయంలో తాను చీఫ్ ఆఫ్ పర్సనల్‌గా విధులు నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు.

**300 మంది మహిళలు..** ఈ నాలుగో బ్యాచ్‌లో మొత్తం 1,429 మంది అగ్నివీరులున్నారని తెలిపారు. వారిలో 300 మంది మహిళలు ఉన్నారన్నారు. అగ్నివీరుల తొలి బ్యాచ్‌లో కనిపించిన ఉత్సాహం, ప్రేరణ, విశ్వాసం అంతా ఈ బ్యాచ్‌లో సైతం సుస్పష్టమవుతుందని ఆయన పేర్కొన్నారు.




## కాంగ్రెస్‌లో చేరబోయే 11వ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఇతడే?

**కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ లిస్ట్‌లో నెక్ట్స్ ఎవరు? 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు హస్తం కండువా కప్పిన సీఎం రేవంత్‌రెడ్డి... పదకొండో ఎమ్మెల్యేను రెడీ చేశారా? డిప్యూటీ సీఎం భట్టిని పొగడ్తలతో ముంచెత్తిన కారు పార్టీ ఎమ్మెల్యే... తన దారి గాంధీభవన్ వైపనే సంకేతాలు పంపారా? సొంత పార్టీ నేతల కంటే కూడా ఎక్కువగా డిప్యూటీ సీఎం భట్టిని ఆకాశానికెత్తేయడం వెనుక రీజనేంటి? ఆ ఎమ్మెల్యే పార్టీ మారతారంటూ గత కొంతకాలంగా జరుగుతున్న ప్రచారం నిజమేనా? ఎవరా ఎమ్మెల్యే..?**

**కాంగ్రెస్‌లో చేరనున్న ఎమ్మెల్యేల్లో నెక్ట్స్ అనిల్ జాదవ్ ఉన్నారనే ప్రచారం..** కారు దిగేస్తున్న ఎమ్మెల్యేల సరసన చేరేందుకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తహతహ లాడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో బోథ్ నుంచి బీఆర్ఎస్ తరఫున గెలిచిన అనిల్ జాదవ్... అధికార పార్టీ నేతలతో పోటీపడుతూ... ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో పడటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన గోడ దూకేందుకు సిద్ధంగా ఉన్నారని.. గత కొంతకాలంగా ప్రచారం జరుగుతున్నా... తాజా ఎపిసోడ్‌తో ఆ ప్రచారం నిజమని నమ్మాల్సి వస్తోందంటున్నారు పరిశీలకులు. రెండు రోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వ్యవహరించిన తీరుతో కాంగ్రెస్‌లో చేరనున్న ఎమ్మెల్యేల్లో నెక్ట్స్ అనిల్ జాదవ్ ఉన్నారనే ప్రచారం ఊపందుకుంది.

**ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునేలా బీఆర్ఎస్ ఎమ్మెల్యే తీరు..** డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క గత బుధవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం పరిధిలోని పిప్రి గ్రామంలో పర్యటించారు. సరిగ్గా ఏడాదిన్నర క్రితం అంటే గతేడాది మార్చి 16న ఇదే గ్రామం నుంచి పీపుల్స్ మార్చ్ పాదయాత్రను ప్రారంభించారు భట్టి. సీఎల్పీ నేత హెూదాలో నాడు పాదయాత్ర చేసిన భట్టి.... తమ పార్టీ అధికారంలోకి వస్తే పిప్రి గ్రామ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీలను అమలు చేయడంలో భాగంగా గత బుధవారం పిప్రిలో పర్యటించారు భట్టి. ఐతే ఈ సభలో కాంగ్రెస్ నేతలతో పోటీపడుతూ మరీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్.... ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునేలా మాట్లాడిన తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇదే ఇప్పుడు అనేక ఊహాగానాలకు తెరలేపింది.

**డిప్యూటీ సీఎం సభకు భారీ అనుచరగణంతో వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే..** ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన డిప్యూటీ సీఎం భట్టి సభకు ఆదిలాబాద్ జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలకు ఆహ్వానం పంపారు. వీరిలో ఇద్దరు బీఆర్ఎస్, ఒకరు బీజేపీ ఎమ్మెల్యే ఉండగా, మిగిలిన ఎమ్మెల్యే కాంగ్రెస్‌కు చెందిన వారు. ఐతే బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ హెలిపాడ్ వద్దే భట్టిని కలిసి వెళ్లిపోయారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అసలు అటువైపే చూడలేదు. ఇక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎద్మ బొజ్జు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ ఇద్దరిలో అనిల్ జాదవ్ హాజరే చర్చకు దారితీసింది. డిప్యూటీ సీఎం సభకు భారీ అనుచరగణంతో కలిసి వచ్చిన అనిల్ జాదవ్... డిప్యూటీ సీఎం ఆశీస్సులు ఉండాలనే స్థాయిలో పెర్ఫార్మెన్స్ చేయడమే పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ డిబేట్‌కు తెరలేపింది.

**మన ప్రభుత్వం అంటూ హాట్ కామెంట్స్..** డిప్యూటీ సీఎం భట్టి సభలో బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్పీచ్ చూసి అంతా ఆశ్చర్యపోయారు. విపక్షానికి చెందిన ఎమ్మెల్యే డిప్యూటీ సిఎం భట్టిని తెగ పొగిడేయడం వెనుక రీజనేంటి? అనేది తెలుసుకోలేక స్థానిక బీఆర్ఎస్ నేతలతోపాటు కాంగ్రెస్ నేతలు జుట్టు పీక్కుంటున్నారు. కాంగ్రెస్ నేతలు సైతం ఆశ్చర్యపోయేలా అనిల్ జాదవ్ పొగడ్తలున్నాయంటున్నారు. తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని కాసేపు మరచిపోయిన అనిల్ జాదవ్... తనలో ఇంకా కాంగ్రెస్ రక్తమే ప్రవహిస్తోందని సంకేతాలిచ్చారా? అనే చర్చ జరుగుతోంది. ఒకనానొక దశలో మన ప్రభుత్వం అంటూ అనిల్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి.

**కాంగ్రెస్ పార్టీతో, ఆ పార్టీ నేతలతో విడదీయరాని అనుబంధం..** వాస్తవానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు కాంగ్రెస్ పార్టీతో పాటు.. ఆ పార్టీలోని కొందరు నేతలతో విడదీయరాని అనుబంధం ఉంది. 2004లో తెలంగాణ ఉద్యమ సమయంలో టి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనిల్ జాదవ్ పనిచేశారు. అనంతరం టీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. 2009, 2014 ఎన్నికల్లో బోథ్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. 2018లో కాంగ్రెస్ పార్టీ టికెట్ నిరాకరించడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓడిపోయారు. ఎన్నికల అనంతరం 2019లో మళ్లీ టీ.ఆర్.ఎస్ గూటికి చేరి నేరడిగొండ జడ్పీటీసీగా విజయం సాధించారు. ఇక ఇటీవల జరిగిన ఎన్నికల్లో బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు అనిల్ జాదవ్.

**నెక్ట్స్ లిస్ట్ లో ఉన్నది అనిల్? :** అయితే ఎన్నికల అనంతరం రాష్ట్రంలో పరిణామాలు మారిపోతుండటంతో ఒక్కొక్కరుగా బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తో పాటు ఆసిఫాబాద్ నుండి గెలుపొందిన ఎమ్మెల్యే కోవ లక్ష్మీ కూడా పార్టీ మారుతారని జోరుగా ప్రచారం జరిగింది. ఇప్పుడు అనిల్ జాదవ్ వ్యవహారశైలిని చూస్తే నెక్ట్స్ లిస్టులో ఉన్నది ఆయనే అన్న ప్రచారానికి బలం చేకూరుతోందంటున్నారు.

## తెలంగాణకు కొత్త ఎయిర్ పోర్టుల నిర్మాణం. కేంద్ర మంత్రి రామ్మోహన్ కీలక ప్రకటన !

హైదరాబాద్ : తెలంగాణకు కొత్త ఎయిర్ పోర్టుల నిర్మాణం ఉంటుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ కీలక ప్రకటన చేశారు. తెలంగాణ ఇతర ఎయిర్ పోర్టుల నిర్మాణానికి మేము ప్రణాళికలు రెడీ చేస్తున్నాం.. త్వరలోనే వివరాలు వెల్లడిస్తాను అని వెల్లడించారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ జీఎంఆర్ అరేనాలో 2%అం% ఏవియేషన్ సెక్యూరిటీ కల్చర్ వీక్ - 2024 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎయిర్ పోర్ట్ ఉన్నతాధికారులు. ఈ సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. సెంట్రల్ మినిస్టర్ అయ్యాక హైదరాబాద్ లో తొలి ఈవెంట్ కు హాజరయ్యాను.. ఇది నాకు మర్చిపోని రోజు అన్నారు. 2014 కు ముందు తరువాత ఏవియేషన్ లో అనేక వచ్చాయి..చంద్రబాబు నాయుడు ఆలోచనతో శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నిర్మించబడిందని వెల్లడించారు. దేశంలో నాల్గవ అతిపెద్ద ఎయిర్ పోర్ట్ గా శంషాబాద్ ఎయిర్ పోర్ట్ ఉంది..ఎందు కు ఇంత పెద్ద ఎయిర్ పోర్ట్ అన్నారు.. వరల్డ్ లోనే టాప్ 10 ఎయిర్ పోర్ట్స్ సరసన నిలిచిందని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎయిర్ పోర్ట్స్ నిర్మాణానికి.. అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ప్రకటించారు.



## టీటీడీపీలో పాత కమిటీల రద్దు

హైదరాబాద్: తెలంగాణలో భవిష్యత్‌లో అధికారంలోకి రావడమే లక్ష్యమని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. త్వరలో గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణంపై ఫోకస్ పెడతానని అన్నారు. 15 రోజుల్లో తెలంగాణలో సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. యువకులకు, బీసీలకు పెద్దపీట వేస్తామని అన్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ తర్వాతనే టీటీడీపీ అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని వెల్లడించారు. టీటీడీపీ ముఖ్యనాయకుల సమావేశంలో చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. టీటీడీపీలో పాత కమిటీలను రద్దు చేస్తూ చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. పార్లమెంట్, అసెంబ్లీ సెగ్మెంట్‌ల వారిగా ఉన్న కమిటీలను రద్దు చేశారు. ఏపీ, తెలంగాణలలో ఒకేసారి కొత్త కమిటీలు ఏర్పాటు చేయాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. అనంతరమే తెలంగాణ టీడీపీ నూతన అధ్యక్షుడి ఎంపిక చేస్తారని సమాచారం. ఏపీ తరహాలోనే కష్టపడి పని చేయాలని కార్యకర్తలకు చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. ప్రతి నెల రెండో శనివారం, ఆదివారం తెలంగాణకు రానున్నారు. పార్టీ నిర్మాణం పైనే దృష్టి సారించనున్నారు.




## కొత్త అధ్యక్షుడిపై ఎటూ తేల్చుకోలేకపోతున్న బీజేపీ అధిష్ఠానం..!

## కారణం ఏంటి..!?

హైదరాబాద్ : తెలంగాణ బీజేపీ సారథిపై అధిష్టానం కసరత్తు ఇంకా కొలిక్కి రాలేదా? పార్టీనే నమ్ముకున్న వారికి అధ్యక్ష స్థానం వరిస్తుందా? పార్టీ నమ్ముకున్న వారికి అందలం ఎక్కిస్తుందా? సీనియర్ల మద్దతు ఎవరికి? కొత్తగా వచ్చిన నేతల ఆశలు ఏంటి? పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే కొత్త సారథిని నియమిస్తామని చెప్పిన అధిష్టానం ఎటూ తేల్చుకోలేకపోతోందా? అసలు తెలంగాణ కమలం పార్టీలో ఏం జరుగుతోంది?

**పార్టీలో తొలి నుంచి ఉన్న నేతలకే అవకాశమివ్వాలని సీనియర్ల సూచన..** ఆల్టర్‌నేట్ సర్కార్ అంటూ తెలంగాణపై భారీగా ఆశలు పెట్టుకున్న కమలం పార్టీ.... కొత్త అధ్యక్షుడిని నియమించే విషయంలో ఎటూ తేల్చుకోలేకపోతోందా? అన్న చర్చ జరుగుతోంది. ప్రస్తుత అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్థానంలో కొత్త నేతను నియమించే విషయంలో పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అధ్యక్ష పదవిని ఆశిస్తున్న వలస నేతలను ఎలా సర్దుబాటు చేయాలో తేల్చుకోలే కొత్త సారథి నియామకం ఆలస్యమవుతోందంటున్నారు. పార్టీలో తొలి నుంచి ఉన్న నేతలకే అవకాశమివ్వాలని సీనియర్ నేతలు సూచిస్తున్నట్లు చెబుతున్నారు.

దీంతో ఒరిజనల్ బీజేపీ కోటాలో మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, గంగిడి మనోహర్ రెడ్డిల్లో ఒకరికి అధ్యక్ష పదవి వరించే అవకాశం ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

**బీజేపీ సభ్యత్వం తీసుకున్న నాటి నుంచి అధ్యక్ష పదవిపైనే గురి..** తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవిపై పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు ఆశలు పెట్టుకున్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా సీనియర్ నేత ఈటల రాజేందర్ చాలా కాలంగా అధ్యక్ష పదవి ఇస్తారని ఎదురుచూస్తున్నారు. తెలంగాణలో మాజీ సీఎం కేసీఆర్‌కు తానే ప్రత్యామ్నాయ నేతగా ఎదగాలనే లక్ష్యంతో బీజేపీలో చేరిన ఈటల... బీజేపీ సభ్యత్వం తీసుకున్న నాటి నుంచి అధ్యక్ష పదవిపైనే గురిపెట్టారు. పార్టీ కూడా ఆయనకు ఆ స్థాయి గౌరవమే ఇచ్చింది. కానీ, కాషాయ సిద్ధాంతాలను అనుసరించి ఇప్పటివరకు ఈటలకు అధ్యక్ష పదవిపై ఇవ్వకుండా నెట్టుకొచ్చింది. అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి అధ్యక్షుడు బండి సంజయ్ పదవీ కాలం ముగిసిన వెంటనే... తనకు ఇవ్వాలని ఈటల పార్టీ హైకమాండ్‌ను కోరినట్లు ప్రచారం జరిగింది. ఈ పదవి విషయమై పార్టీలో రెండు వర్గాలు ఏర్పడినట్లు అప్పట్లో చెప్పుకున్నారు. చివరికి ఈ విభేదాల వల్లే కొందరు నేతలు పార్టీని వీడారంటున్నారు.

**తెలంగాణ బీజేపీకి ఈటలే సుప్రీం అన్న ప్రచారం!**

ఈ వర్గ విభేదాల వల్లే అప్పట్లో కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డికి అధ్యక్ష పదవి అప్పగించింది పార్టీ. ఎన్నికలయ్యాక కొత్త అధ్యక్షుడిని నియమిస్తామని చెప్పింది హైకమాండ్. ఇక అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే పార్లమెంట్ ఎన్నికలు జరగడంతో నియామక ప్రక్రియ పెండింగ్‌లో పడిపోయింది. మరోవైపు అధ్యక్ష పదవి దక్కని ఈటల.. బీసీ సీఎం నినాదాన్ని అందిపుచ్చుకుని... రెండుచోట్ల పోటీ చేశారు. ఓ వ్యక్తి రెండు చోట్ల పోటీ చేయడం బీజేపీ సిద్ధాంతాలకు పూర్తిగా విరుద్ధం. ప్రధాని మోదీ వంటి నేతలకు మాత్రమే ఇలాంటి మినహాయింపు ఉంటుంది. ఈటల విషయంలో ఈ మినహాయింపు ఇవ్వడంతో తెలంగాణలో బీజేపీకి ఈటలే సుప్రీం అన్నట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ఐతే అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా ఓడిన ఈటల... ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి గెలిచి పరువు దక్కించుకున్నారు. ఇక ఇప్పుడు పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తున్నానని చెప్పుకుంటున్న ఈటల... తన అసలు లక్ష్యమైన బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపై గురిపెట్టారని చెబుతున్నారు. ఇద్దరూ ఎంపీలు, సీనియర్లే కావడం.. ఇద్దరూ పార్టీలోకి వలస వచ్చిన వారే కావడంతో రాష్ట్ర బీజేపీ సీనియర్లు ఆ ఇద్దరికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించే విషయంలో అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇద్దరూ సమర్థులే అయినప్పటికీ.. పార్టీ సిద్ధాంతాల ప్రకారం తొలి నుంచి పార్టీని నమ్ముకున్న వారికి అవకాశమివ్వాలని... ఆర్ఎస్ఎస్, హిందుత్వ అజెండాకు అనుగుణంగా పని చేసే వారికి ప్రాధాన్యమివ్వాలని సీనియర్లు కోరుకుంటున్నట్లు చెబుతున్నారు.

**రేసులోకి బండి సంజయ్ అనుచరుడు..** దీంతో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు అనుచరుడైన సీనియర్ నేత గంగిడి మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు రేసులోకి వచ్చినట్లు చెబుతున్నారు. ఈ ఇద్దరి అభ్యర్థిత్వంపై సీనియర్లు సానుకూలంగా ఉన్నట్లు చెబుతున్నారు. మనోహర్‌రెడ్డికి మద్దతుగా బండి, రామచందర్‌రావు పేరును మరో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సీనియర్ నేత లక్ష్మణ్ బలపరుస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మనోహర్‌రెడ్డి, రామచందర్‌రావుల్లో ఎవరికి పదవి ఇచ్చినా... పార్టీలో తమ ఆధిపత్యం ఉంటుందని కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ భావిస్తున్నట్లు చెబుతున్నారు. పార్టీలో తొలి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తున్నామనే సంకేతాలివ్వడం ద్వారా... వలస నేతలకు చెక్ చెప్పొచ్చనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. దీంతో రాష్ట్ర పార్టీ అధ్యక్ష పదవిని చేపట్టాలనే ఈటల ఆశలు ఇప్పట్లో ఫలించే అవకాశాలు కనిపించడం లేదని బీజేపీ వర్గాల్లో టాక్ నడుస్తోంది.

**ఆ ఇద్దరిలో ఒకరికి సారధ్య బాధ్యతలు..?** ప్రస్తుత అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రి కావడంతో బిజీ అయిపోయారని, దీంతో పార్టీ వ్యవహారాలకు సమయం కేటాయించలేకపోతున్నారని తెలుస్తోంది. ఇక జాతీయ పార్టీ అధ్యక్ష పదవినీ భర్తీ చేయాల్సి వున్నందున త్వరలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఏది ఏమైనా మనోహర్‌రెడ్డి, రామచందర్‌రావుల్లో ఒకరు రాష్ట్ర అధ్యక్షుడయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు.

# సంపాదకీయం

## చుట్టూ అరాచకం..అశాంతి... భారత్ సంగతేంటి ?

భారత్ శాంతి భూమి కర్మ భూమి. భారత్ లో ప్రజలు ఎక్కువగా సనాతన విశ్వాసాలు కలిగి ఉంటారు. అలా అని పొరుగు దేశాలలో పౌరులు ఉండరని కాదు. అక్కడ అస్థిరత మొదటి నుంచి ఉంది. ఇపుడు వెల్లువగా మారింది. చిత్రమేంటి అంటే గడచిన కొద్ది కాలంలోనే భారత్ చుట్టు పక్కన ఉన్న దేశాలు అన్నీ వరసగా సంక్షోభంలోకి వెళ్ళిపోయాయి. అక్కడ ప్రజలు హాహాకారాలు చేస్తూ ఉండడం కనిపిస్తోంది. ఆ క్షణం వరకూ దేశాన్ని శాసించిన పాలకులు ప్రాణాలు అరచేత బెట్టుకుని దేశాలు విడిచిపెట్టి పారిపోవడం అరాచకానికి అసహనానికి పరాకాష్టగా చెబుతున్నారు. తాజా ఉదంతం బంగ్లాదేశ్ నే మొదట ప్రస్తావించుకుంటే ఆగస్ట్ 5న షేక్ హసీనా ఉన్నఫళంగా కట్టు బట్టలతో ప్రాణాలను అరచేత బెట్టుకుని దేశం విడిచి పారిపోయారు. ఆమెకు భారత్ ఆశ్రయం కల్పించింది. ప్రపంచంలోనే అత్యధిక కాలం ప్రధానిగా పాలించిన ఐరన్ లేడీ షేక్ హసీనా ఈ రోజు పరిస్థితి ఇది. ఆమె హయాంలో అభివృద్ధి పరుగులు తీసింది. దేశ ఆర్థిక వృద్ధి రేటు బాగా పెరిగింది. కానీ అతి వాద శక్తులు మాత్రం ఆమెను కూలదోయాలని అనుకున్నాయి. గద్దె దించేశాయి. ఇక శ్రీలంక సంక్షోభం అందరికీ గుర్తుండే ఉంటుంది. మహేంద్ర రాజ్ పక్షే ప్రభుత్వం అధిక ధరలు పెరిగిన ద్రవ్యోల్బణంతో పాటు ప్రజలలో పెరిగిన అసహనానికి కుప్ప కూలింది. దాంతో రాజ ప్రాసాదానికే ప్రజలు తిరుగుబాటుగా తరలివచ్చారు. అలా రాజ్ పక్సేను వెంటాడారు. కానీ ఆయన తప్పించుకుని పారిపోయారు. ఇక పాకిస్తాన్ కి 2022 దాకా ఎదురులేని విధంగా పాలించిన ఇమ్రాన్ ఖాన్ మీద అవిశ్వాసం పెట్టి గద్దె దించేశారు. ఆయన పరిస్థితి చూస్తే ప్రస్తుతం కారాగార వాసంతో మగ్గుతున్నారు. ఆయనకు ప్రాణహాని కూడా ఉందని అంటున్నారు. రెండేళ్ళుగా ఆయన జైలు గోడల మధ్యనే గడుపుతున్నారు. అక్కడ సైన్యం గుప్పిట పాలన సాగుతోంది. అక్కడ సైన్యం నియమించిన ప్రభుత్వం పేరుకే ఉంది. ఆ ప్రభుత్వం కూడా ఏమీ కంట్రోల్ చేయలేకపోతోంది. ఆకలి, నిరుద్యోగం, పేదరికం తో పాకిస్థాన్ ఎన్నడూ చూడని ఇబ్బందులు పడుతోంది. పాకిస్థాన్ కి అప్పు పుట్టే పరిస్థితి కూడా లేకుండా పోయింది. దాంతో ప్రజలలో తిరుగుబాటు వస్తోంది. ఇదే అదనుగా ఉగ్ర వాదులు రెచ్చిపోతున్నారు. వారు పాలకులనే సవాల్ చేస్తున్నారు. ఇక ఇదే తీరున మరో దేశం ఉంది అదే ఆఫ్ఘనిస్తాన్. అక్కడ ప్రజా ప్రభుత్వాన్ని కుప్ప కూల్చి తాలిబాన్లు అధికారం అందుకున్నారు. మధ్య యుగం నాటి శాసనాలతో పాలన చేస్తున్నారు. అత్యంత దయనీయమైన పరిస్థితులు ఆఫ్ఘాన్ లో ఉన్నాయి. ఈ రోజుకీ తాలిబన్ల పాలనను ప్రపంచం అంగీకరించలేదు. ఏ దేశమూ వారిని గుర్తించడం లేదు. అక్కడ ప్రజలు అసహనంతో ఉన్నారు. అరాచకం అక్కడ కనిపిస్తోంది. అలాగే భారత్ పొరుగున ఉన్న మయన్మార్ ని తీసుకున్నా అరాచకమే చిరునామాగా మారింది. అక్కడ కూడా సైన్యందే పాలన. వారి నియంత పోకడలతో ప్రజలు నరకం చూస్తున్నారు. ఎదురు నిలిస్తే కాల్చి చంపుతున్నారు. అయినా సరే ప్రజలలో పెల్లుబికిన అసహనం అరాచకంగా మారి తిరుగుబాటు వైపుగా సాగుతోంది. ఒక విధంగా చెప్పాలీ అంటే మయన్మార్ లో అంతర్యుద్ధం చాన్నాళ్ళుగా సాగుతోంది. ఇలా చుట్టు పక్కన ఉన్న దేశాలు అన్నీ అరాచకంతో నిండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ లోనూ అలాంటి పరిస్థితులు వస్తాయని అంటున్నారు కాంగ్రెస్ నేతలు. విపక్షాలు. షేక్ హసీనాను పట్టిన గతే ప్రధాని మోడీకి కూడా పడుతుందని మధ్యప్రదేశ్ కి చెందిన కాంగ్రెస్ నేత సజ్జన్ సింగ్ వర్మ విమర్శించారు. ప్రభుత్వ విధానాలు నచ్చక బంగ్లా తరహాలో మోడీ ఇంటి ముందుకు వచ్చి ఏదో రోజున ప్రజలు దానిని ఆక్రమించుకుంటారు అని ఆయన అంటున్నారు. అయితే విపక్షాలు రాజకీయంగా విభేదించవచ్చు విమర్శలు చేసుకోవచ్చు కానీ పొరుగు దేశాల అరాచకాన్ని భారత్ లో కూడా రావాలని కోరుకోవడం మాత్రం తగదని అంటున్నారు. భారత్ లో స్వేచ్ఛ ఉంది. ఆందోళన చేసేందుకు మాట్లాడేందుకు అవకాశం ఉంది. ప్రభుత్వాలు మొండిగా ఉంటే దింపేందుకు ఎన్నికల వ్యవస్థ అనేది గట్టిగా ఉంది. అందువల్ల భారత్ లో అలాంటివి జరగరాదు అనే అంతా కోరుకుంటున్నారు. భారత్ లో అలాంటివి జరగకపోయినా పొరుగు దేశాల్లో ఉన్న సంక్షోభాల వల్ల భారత్ ఆర్థికంగా ఇతరత్రా అనేక ఇబ్బందులు మాత్రం పడుతోంది. అందుకే పొరుగు వారు కూడా బాగుండాలని కోరుకోవాలి.

# పెరిగిన ప్రయోజనాలు అందేనా!



గోదావరిఖని : సింగరేణిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత కార్మికులకు పెరిగిన వేతన సవరణకు సంబంధించిన ప్రయోజనాలు అందలేదు. 2023 మే 20న పదకొండో వేతన సవరణ ఒప్పందం కుదిరింది. 2021 జులై 1 నుంచి మొదలు కావాల్సిన పదకొండో వేతన సవరణ 22 నెలలు ఆలస్యంగా జరిగింది. కనీస వేతనం 19 శాతానికి పెంచుతూ ఒప్పందం చేసుకున్న కార్మిక సంఘాలు కొత్త వేతనాలను 2023 జూన్ నెల నుంచి కార్మికులకు అందజేస్తున్నారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు బకాయిలు మాత్రమే చెల్లించారు. పెరిగిన వేతనాల ప్రకారం పెరిగే సీఎంపీఎఫ్‌తో పాటు పింఛను పంపిణీ చేయడం లేదు. 2023 జూన్ నుంచి కొత్త వేతనాలను అమలు చేస్తున్న యాజమాన్యం కార్మికులకు పెరిగిన వేతనాల ప్రకారం బకాయిలు కూడా చెల్లించింది. విశ్రాంత కార్మికులకు పెరిగిన వేతనాల ప్రకారం సీఎంపీఎఫ్, పింఛను పంపిణీ చేయకపోవడంతో వాటి కోసం కార్మికులు ఎదురు చూస్తున్నారు. పదకొండో వేతన ఒప్పందం జరిగి ఏడాది గడచినా ఇప్పటి వరకు పింఛను, సీఎంపీఎఫ్ బకాయిలు చెల్లించడం లేదని వాపోతున్నారు. దీనిపై జాతీయ కార్మిక సంఘాల నాయకులు ఒత్తిడి తేవాలని కోరుతున్నారు.

1500 మందికి పైగా...

సింగరేణి వ్యాప్తంగా 1500 మందికి పైగా విశ్రాంత కార్మికులకు పెరిగిన వేతనాల ప్రకారం పింఛను, సీఎంపీఎఫ్ డబ్బులు రావాల్సి ఉంది. 2021 జులై 1 నుంచి అమలు కావాల్సిన పదకొండో వేతన సవరణ 22 నెలలు ఆలస్యంగా జరిగింది. 2023 మే 20న ఒప్పందం కుదరడంతో అప్పటి వరకు సంస్థలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు పెరిగిన వేతనాల ప్రకారం పింఛనులో కొంత పెరుగుదల ఉంటుంది. దీంతో పాటు సీఎంపీఎఫ్ నిల్వలో సైతం మార్పు ఉంటుంది. వేతన సవరణకు ముందే ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు, ఉద్యోగులకు సవరించిన మేరకు పింఛనులో పెరుగుదల ఉంటుంది. సీఎంపీఎఫ్ నిల్వలో కొంత పెరుగుదల ఉండే అవకాశం ఉన్నా వాటిని చెల్లించేందుకు ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంతో ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత కార్మికులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

వచ్చే నెలలో సవరించే అవకాశం

పెరిగిన వేతనాల ప్రకారం పింఛను, సీఎంపీఎఫ్ బకాయిలను వచ్చే నెల వరకు సవరించే అవకాశం ఉంది. ఫారం వి పూరించి పంపించాలి. ఆ ప్రక్రియ మొదలైంది. పదకొండో వేతన సవరణకు సంబంధించి పెరిగిన జీతభత్యాల ప్రకారం పింఛనులో కొంత మార్పు ఉంటుంది. ప్రస్తుతం పదో వేతన సవరణ ప్రకారం విశ్రాంత కార్మికులకు పింఛను చెల్లిస్తున్నారు. కొత్త వేతనాల ప్రకారం సవరించడం ద్వారా కొంత వరకు పింఛను పెరిగే అవకాశం ఉంది. దానికి సంబంధించిన ప్రక్రియ వచ్చే నెల వరకు పూర్తవుతుంది.
వి.సీతారామయ్య, ఏఐటీయూసీ నాయకుడు

# ప్రత్యేక పాలన తప్పదా?



కరీంనగర్ : ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ముగిసింది. దాన్ని పొడిగించకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించింది. జులై 4న జిల్లా, మండల పరిషత్ ఛైర్మన్ల పదవీకాలం ముగియనుంది. వారిని కొనసాగిస్తారా? లేక ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగిస్తారా? అనే విషయంపై చర్చ జరుగుతోంది.

వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు..

బీసీ జనగణన చేపట్టి ఆ తర్వాత గ్రామ పంచాయతీ, ప్రాదేశిక రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికలు చేపట్టాలని ఒక వైపు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఇదిలా ఉండగా గత ఎన్నికలు జరిగినప్పుడు ప్రకటించిన రిజర్వేషన్లు పదేళ్లపాటు కొనసాగాలని అప్పటి ప్రభుత్వ చట్టం రూపొందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ఏ మేరకు నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిన అవసరముంది. స్థానిక సంస్థల ఎన్నికలు వరుస క్రమంలో రానున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పథకాలు అమలు విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది.హస్తం పట్టు కోసం..ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల జడ్పీ ఛైర్‌పర్సన్లుగా ముగ్గురు, ఛైర్మన్‌గా ఒకరు భారాస నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జడ్పీటీసీ సభ్యులు కూడా ఆ పార్టీ పక్షాన ఎక్కువ మంది కొనసాగుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల క్రమంలో కొన్ని జిల్లాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు కొందరు భారాస వీడి కాంగ్రెస్‌లో చేరారు. కరీంనగర్ గ్రామీణం జడ్పీటీసీ సభ్యురాలు పురుమల్ల లలిత భర్త శ్రీనివాస్ భారాసను వీడి కాంగ్రెస్‌లో చేరి.. కరీంనగర్ శాసనసభ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఇలా భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారు ఉన్నారు. కొందరు ఎంపీపీలపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టి హస్తగతం చేసుకుంది. ప్రస్తుతం వీరి పదవీకాలం 15 రోజులు మాత్రమే మిగిలింది. తమ పదవులకు కొనసాగిస్తారనే ఆశ కొందరిలో ఉంది. కానీ కాంగ్రెస్ నేతలు ప్రజాప్రతినిధులు మాత్రం ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించాలని కోరుకుంటున్నట్లు సమాచారం. అధికారులను తమకు అనుగుణంగా మలచుకొని స్థానిక సంస్థలలో పాగా వేయాలని భావిస్తున్నారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల విషయాన్ని అక్టోబరు వరకు వేచి చూసే ధోరణిలో ఉండే అవకాశముంది. మరో వైపు ముఖ్యమంత్రి కూడా జిల్లాల పర్యటన చేపట్టి పార్టీని పటిష్ఠం చేసేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి సమీక్షలు నిర్వహిస్తారని ప్రచారం జరుగుతోంది.

# బెల్లంపల్లికి మళ్లీ సబ్‌కలెక్టర్



బెల్లంపల్లి : బెల్లంపల్లిలో సబ్‌కలెక్టర్ పోస్టు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో బెల్లంపల్లిలో సబ్‌కలెక్టర్ పోస్టు ఉండేది. 2018లో అప్పటి రాష్ట్రప్రభుత్వం సబ్‌కలెక్టర్ పోస్టు మంజూరు చేసింది. 2020లో మళ్లీ ఆర్డీఓను నియమించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం జిల్లాల పునర్విభజన సమయంలో బెల్లంపల్లిలో జిల్లా ఏర్పాటు కోసం ఉద్యమాలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో మంచిర్యాలను జిల్లాగా ప్రకటించిన ప్రభుత్వం బెల్లంపల్లిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసింది. 2016 అక్టోబరు 10న తొలి ఆర్డీఓగా ఎన్.పాండురంగ బాధ్యతలు స్వీకరించారు. బెల్లంపల్లికి ప్రాధాన్యత దృష్ట్యా 2018 జనవరి 4వ తేదీన సబ్‌కలెక్టర్ పోస్టును మంజూరు చేసి సబ్‌కలెక్టర్‌గా రాహుల్‌రాజ్‌ను నియమించారు. రెండేళ్లు పనిచేసిన తర్వాత రాహుల్‌రాజ్ బదిలీ అయ్యారు. అయిదు రోజుల పాటు స్నేహలత సబ్‌కలెక్టర్ బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం మరో నాలుగు నెలల పాటు సురేందర్‌రావు ఇన్‌ఛార్జి సబ్‌కలెక్టర్‌గా కొనసాగారు. మళ్లీ ఆర్డీఓగా శ్యామలదేవిని ప్రభుత్వం నియమించింది. ఈమె రెండేళ్లపాటు పనిచేశారు. మూడు నెలలపాటు కాసబోయిన సురేష్ ఆర్డీఓగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆర్డీఓగా గత ఏడాది నవంబర్‌నుంచి హరికృష్ణ కొనసాగుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆక్రమణలు ఉన్నచోట ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలోనే బెల్లంపల్లికి సబ్‌కలెక్టర్ పోస్టును మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఈ నెల 13వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. కబ్జాలకు అడ్డుకట్ట

అయిదేళ్లలో బెల్లంపల్లి పట్టణంతో పాటు మండలంలో ఆక్రమణల జోరు కొనసాగింది. ఎక్కడ ఏ భూమి ఆక్రమణకు గురైందో ఇప్పటికీ రెవెన్యూ అధికారులకు సమాచారం లేదు. ఏకంగా రెవెన్యూ అధికారులే అక్రమార్కులకు వంత పాడడంతో ప్రభుత్వ భూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ గెలిచినప్పటి నుంచి భూఆక్రమణల విషయంలో అంత సీరియస్‌గా లేకున్నప్పటికీ తెరవెనుక వీటిని అరికట్టేందుకు పకడ్బందీగా పావులు కదిపారు. ఆర్డీఓ స్థాయిలో ఆక్రమణలకు కళ్లెం వేయలేమని గ్రహించిన వినోద్ బెల్లంపల్లికి ఐఏఎస్ అధికారిని నియమించేలా ప్రభుత్వానికి నివేదికలు పంపారు. గతంలో దుర్గం చిన్నయ్య ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కబ్జా ఆరోపణలు ఎదుర్కొన్నారు. అనుచరులే ఆక్రమణలకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. ఈ అనుభవంతో ఎమ్మెల్యే వినోద్ ముందుజాగ్రత్తగా ఐఏఎస్‌ను నియమించేలా ప్రభుత్వంపై తీసుకొచ్చిన ఒత్తిడి ఫలించింది. గతంలో రాహుల్‌రాజ్ సబ్‌కలెక్టర్‌గా ఉన్న సమయంలో అతనే స్వయంగా వెళ్లి ఆక్రమణల స్థలాల్లో బోర్డులు పాతిన సందర్భాలు ఉన్నాయి.

# నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

శామీర్ పేట, (గరుడ వార్త) : నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉండబోతోందని శామీర్ పేట విద్యుత్ ఏఈ సురేందర్ శనివారం సాయంత్రం పేర్కొన్నారు. దేవరయంజాల్ విద్యుత్ సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దేవరయంజాల్ సబ్ స్టేషన్ నుంచి అరికల గూడెం వరకు ఉన్న గోదాంలన్నిటికీ విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అరకలగూడెం నుంచి డీఎంసీ వై జంక్షన్ వరకు ఉన్న గోదాములతో పాటు వ్యవసాయ పొలాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని శామీర్ పేట విద్యుత్ ఏఈ కోరారు.

# రెండేళ్లుగా ఎదురుచూపులు

సంగారెడ్డి : ఒకప్పుడు కుటుంబ వ్యవస్థలో పెద్దల మాటే శరణ్యం. పెద్దలకు సేవ చేయటం, గౌరవించడం విద్యుక్త ధర్మాలుగా భావించే సంస్కృతి. సంపాదన మొత్తాన్ని కుటుంబ పెద్ద చేతిలోనే పెట్టి అవసరాలకు డబ్బు అడిగి తీసుకునే వారు. కుటుంబ పెద్ద ఏ నిర్ణయం తీసుకున్నా తమ ఉన్నతికేనని కట్టుబడి ఉండే సంస్కృతిలో క్రమంగా మార్పులు వచ్చాయి. సమాజంలో ప్రస్తుతం వయోవృద్ధుల్లో ఎక్కువ మంది నిరాదరణకు గురవుతున్నారు. ఇది ఆందోళన కల్గించే పరిణామం. ఇలాంటి వృద్ధుల ఇబ్బందులు దూరం చేయాలనే లక్ష్యంతో వృద్ధాశ్రమాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. జిల్లాకు రెండేళ్ల కిందట మంజూరు చేసిన వృద్ధాశ్రమం ఇప్పటికీ వినియోగంలోకి రాలేదు.

రాష్ట్ర వ్యాప్తంగా మూడు..: సంగారెడ్డి, సిరిసిల్ల, ఆదిలాబాద్ జిల్లాల్లో వృద్ధాశ్రమాల ఏర్పాటుకు ప్రభుత్వం రెండేళ్ల కిందట నిర్ణయించింది. ఈ మేరకు మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖలకు ఉత్తర్వులు జారీ చేసింది. రెడ్ క్రాస్ సంస్థతో కలిసి వీటి నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆయా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. ప్రభుత్వం మూడు వృద్ధాశ్రమాలకు.. ఒక్కోదానికి రూ.50 లక్షల చొప్పున కేటాయించింది. వృద్ధాశ్రమ నిర్వహణను రెడ్‌క్రాస్ సొసైటీ చూడనుంది.

మహిళా ప్రాంగణంలో నిర్మాణం: జిల్లాకు మంజూరైన వృద్ధాశ్రమం నిర్మాణానికి మహిళా ప్రాంగణం ఆవరణను ఎంపిక చేశారు. రూ.50 లక్షలు వెచ్చించి నిర్మాణ పనులు చేపట్టారు. నిధుల లేమితో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. వసతుల కల్పన, తదితరాలకు మరిన్ని నిధులు అవసరం కాగా.. నిధుల విడుదల లేకపోవడంతో మిగతా పనులు ఏడాదిగా ముందుకు సాగడం లేదు. దీంతో ఏ ఆసరా లేని వృద్ధులు రహదారుల పక్కన కాలం వెళ్లదీస్తున్నారు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ దయనీయంగా జీవనం సాగిస్తున్నారు. వృద్ధాశ్రమం వినియోగంలోకి వస్తే వీరి ఇబ్బందులు దూరమయ్యే అవకాశం ఉంటుంది.

ప్రతిపాదనలు పంపుతున్నాం:లలితకుమారి, జిల్లా సంక్షేమాధికారిణి వృద్ధాశ్రమం పనులు పూర్తి చేసేందుకు అదనపు నిధుల కోసం ప్రయత్నిస్తున్నాం. ఇటీవల కలెక్టర్ వల్లూరు క్రాంతి నిర్మాణ పనుల్ని పరిశీలించారు. పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపేందుకు కసరత్తు చేస్తున్నాం. ప్రభుత్వం తీసుకువచ్చిన వయోవృద్ధుల సంరక్షణ చట్టాలు అమలు చేస్తాం. వారికి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

# అధ్యాపకుల కొరత.. ఆటలకు వెత!

మెదక్ : క్రీడాకారులకు వసతులు కల్పించి, నైపుణ్య శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతామని సర్కారు ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడంలేదు. ఇందుకు కారణం వ్యాయామ అధ్యాపకుల కొరత. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీ చేయడంలేదు. దీంతో విద్యార్థులు రాణించలేకపోతున్నారు. ఉత్సాహం ఉన్నా, శిక్షణ కొరవడడంతో ఆటలకు దూరమవుతున్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ఈ సారైనా వీరి నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 16 ప్రభుత్వ కళాశాలలు ఉన్నప్పటికీ వీటిల్లో ఏ ఒక్క కళాశాలలో వ్యాయామ అధ్యాపకులు కనిపించని పరిస్థితి నెలకొంది. మిగతా గురుకులాలు, ఆదర్శ తదితర వాటిల్లో ఒప్పంద పద్ధతిలో వ్యాయామ అధ్యాపకులను నియమించడంతో ఆయా విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు మాత్రమే వివిధ క్రీడల పోటీల్లో రాణిస్తున్నారు. గత ప్రభుత్వం 20 ఏళ్ల నుంచి ఒప్పంద ఉపన్యాసకులుగా పని చేసిన వారిని క్రమబద్ధీకరించినా, వ్యాయామ అధ్యాపకులను మాత్రం నియమించలేదు.



వర్తించని రిజర్వేషన్లు: క్రీడలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఉన్నత విద్య, ఉద్యోగ తదితర అవకాశాల్లో ప్రత్యేక కోటాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలో రాణించిన విద్యార్థులకు రిజర్వేషన్లు వర్తింపజేస్తున్నారు. చదువుకు ఇది అదనపు అర్హతగా గుర్తిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చదివే విద్యార్థులు ఈ అవకాశాలను కోల్పోతున్నారు. కళాశాలలకు గతంలో క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. సాధన చేయించేవారు లేకపోవడంతో అవి మూలకు చేరాయి.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు:
సత్యనారాయణ, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకులను ఒప్పంద పద్ధతిలో నియమించమని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. ఇంటర్ స్థాయిలో ప్రత్యేక పోస్టులు ఉండవు. పాఠశాల స్థాయిలో ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించి కళాశాలకు పంపిస్తారు. ఆ ప్రక్రియ రాష్ట్రంలో జరగకపోవడంతో ఆ పోస్టులు ప్రతి ఏటా ఖాళీగానే ఉంటున్నాయి. గురుకులాలు, ఇతర కళాశాలల్లో ఒప్పంద పద్ధతిలో కొనసాగుతున్నారు.

# దర్జాగా..!

ఆత్మకూర్ : భూగర్భ జలాలను పెంపొందించే ప్రధాన జలవనరులైన చెరువులు, కుంటలు ఏటేటా కబ్జా కోరల్లో చిక్కుకుంటున్నాయి. ప్రతి సంవత్సరం వేసవి సీజన్‌లో అక్రమార్కులు శిఖం భూములపై కన్నేసి యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. ముఖ్యంగా శిఖంలో యంత్రాల సహాయంతో కట్టలు పోసి మడులు తయారు చేస్తున్నారు. దీంతో విశాలంగా ఉండాల్సిన చెరువులు, కుంటలు కుచించుకుపోతున్నాయి. జిల్లాలో శిఖం ఆక్రమణలకు ఆదిలోనే అడ్డుకట్ట వేయకుంటే రాబోయే రోజుల్లో పెద్ద చెరువులూ.. చిన్న, చిన్న కుంటలుగా మారిపోయే ప్రమాదం ఉంది. ఆయకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారనుంది. బోర్లు, బావుల్లో భూగర్భజలాలు అడుగంటి సాగు విస్తీర్ణం తగ్గనుంది.

**ఆక్రమణలు ఇలా..**

మండల కేంద్రంలోని పెద్ద చెరువు శిఖంభూమిలో పొక్లెయిన్‌తో కట్టలు పోసి మడులుగా చేస్తున్నారు. వేసవిలో చెరువులోని తుమ్మచెట్లను కొట్టివేయడమే కాకుండా చుట్టూ శిఖం భూమిని కబ్జా చేశారు. 802 సర్వేనంబరులో గల పెద్ద చెరువు విస్తీర్ణం 256 ఎకరాలు. ఇందులో సుమారు నలభై ఎకరాల వరకు ఆక్రమించి పొలాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.ఇదే మండలంలోని గట్టికల్‌లో 143 సర్వే నంబరులో 29.04 ఎకరాల్లో ఊర చెరువు విస్తరించి ఉంది. మట్టితో శిఖం భూములు పూడ్చివేసి ఎకరాలకొద్ది కబ్జా చేశారు. శిఖంలో కట్ట నిర్మించి సిమెంట్ గూనలు వేశారని అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండేళ్లలోనే 12 ఎకరాలకు పైగా ఆక్రమించినట్లు చెబుతున్నారు.

నెమ్మికల్‌లోని 484 సర్వే నంబరులో చౌటచెరువు 84 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. మూడేళ్ల క్రితమే శిఖం భూముల ఆక్రమణపై స్థానిక మత్స్యకారులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వేయర్ వెంకటేశ్వర్లు చౌటచెరువును సర్వే చేసి 25 ఎకరాలు ఆక్రమణకు గురయినట్లు తేల్చారు. బాధ్యులపై తీసుకున్న చర్యలు శూన్యం. ఆక్రమణదారుల్లో ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఉన్నట్లు గుర్తించారు. మళ్లీ ఈ వేసవిలోనూ తుమ్మచెట్లను కొట్టేసి యంత్రాల సహాయంతో పొలం మడులు తయారు చేశారు.

సూర్యాపేట మున్సిపాలిటీ కుడకుడ కర్నాలకుంట యథేచ్ఛగా కబ్జాకు గురవుతోంది. శిఖం భూముల్లో ప్లాట్లను తయారు చేశారు. దీనిపై పలుమార్లు ఆందోళన నిర్వహించారు. అధికారులు విచారణ చేసినా చర్యలు చేపట్టలేదు.



చివ్వెంల మండలం వల్లభాపురం,అక్కలదేవిగూడెం చెరువు శిఖాలను రైతులు ఆక్రమించుకొని సాగు చేస్తున్నారు.

పెన్‌పహాడ్ మండలంలోని రంగయ్యగూడెం చెరువు, యల్లప్పకుంట చెరువు శిఖాలు ఆక్రమణకు గురయ్యాయి. చెరువు లోపలికి చొచ్చుకొచ్చి పొలాలు సేద్యం చేస్తున్నారు.

జిల్లాలో ఐబీ లెక్కల ప్రకారం చెరువులు, కుంటల వివరాలు..

వంద ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగినవి: 166 ఆయకట్టు: 36,776 ఎకరాలువంద ఎకరాల లోపు ఉన్న కుంటలు: 870 ఆయకట్టు: 32,609 ఎకరాలుఆక్రమణలపై చర్యలు తీసుకుంటున్నాం

శివధర్మతేజ, ఎస్ఈ, నీటిపారుదల శాఖ, సూర్యాపేట

చెరువుల ఆక్రమణపై ఇటీవల కలెక్టర్‌తో నిర్వహించిన సమావేశంలో చర్చించాం. సూర్యాపేట పట్టణం వరకు ఒక కమిటీ వేశాం. చెరువులు, కుంటల్లో పాత ఎఫ్‌టీఎల్ ఆక్రమించినా, నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటాం. శిఖం భూములను ఆక్రమించే రైతులకు నోటీసులు జారీ చేస్తున్నాం. కబ్జాపై ఫిర్యాదు అందిన సత్వరమే చర్యలు తీసుకుంటాం.

# గ్రామానికో పోలీస్..!

నల్గొండ : పల్లె నుంచి పట్టణం వరకు ఎక్కడ అవినీతి, అక్రమాలు జరిగినా.. పూర్తి స్థాయి సమాచారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి చేరేలా పోలీస్ యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. గ్రామీణ పోలీస్ వ్యవస్థను (వీపీవో) మరింత పటిష్ఠం చేయడంతో పాటు నేర రహిత జిల్లాగా మార్చేందుకు ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రణాళికలు సిద్ధం చేశారు. పదేళ్ల క్రితం ఉన్న విలేజ్ పోలీస్ వ్యవస్థను తిరిగి జిల్లాలో నేటి నుంచి ప్రారంభించనున్నారు. ఇప్పటికే మూడు డివిజన్‌లలో ఏడు గ్రామాలకు పోలీస్ అధికారులను ఎంపిక చేశారు. నాలుగు రోజుల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు జరగనున్నాయి. గ్రామానికి ఒకరు, పట్టణాల్లో వార్డుకు ఒక పోలీస్ అధికారిని ఎంపిక చేసి ప్రధాన కూడళ్లలో వారి చరవాణి నంబర్లు ప్రదర్శిస్తారు. వీరు ఆయా ప్రాంతాల్లో పాత నేరస్థుల కదలికలతో పాటు సంఘవిద్రోహ శక్తుల వివరాలు సేకరిస్తారు. స్థానికంగా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం చూపడంతో పాటు పైస్థాయి అధికారులకు నివేదిస్తారు. గంజాయి, నిషేధిత గుట్కా, బెల్టుషాపులు, రోడ్డు ప్రమాద నివారణ మార్గాలు, దొంగతనాలు, పేకాట స్థావరాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, గుడుంబా తయారీపై నిఘా పెట్టడంతో పాటు పీడీఎస్ బియ్యం, ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించనున్నారు.

జిల్లాకు చేరిన నార్కోటిక్ కిట్లు..

గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి నేటి నుంచి ప్రత్యేక ఏర్పాట్లను ప్రారంభించనున్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌కు గంజాయి తాగితే నిర్ధారించే నార్కోటిక్ యంత్రాలు (ఒక్కోటి రూ.600 ఖర్చుతో) పది చొప్పున అందజేశారు. వీటితో పాటు ఒక నార్కోటిక్ డాగ్ (మత్తుపదార్థాలను గుర్తించే శునకం)కు శిక్షణ ఇచ్చి పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక గదిలో అందుబాటులో ఉంచారు. ఏవోబీ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీలతో పాటు రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో నిఘా పెంచనున్నారు.

నేటి నుంచి అవగాహన సదస్సులు..

జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడిన 60 మందిని గుర్తించారు. వారితో పాటు వారి తల్లిదండ్రులకు మంగళవారం అవగాహన కల్పించనున్నారు. స్టేషన్ల వారీగా పాత నేరస్థుల కదలికలపై అప్రమత్తత పెంచనున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్‌కు తెలిపారు. సమాచారం ఇచ్చే వారు వాట్సప్ చరవాణి నెంబర్ 87126 70426ను సంప్రదించాలని కోరారు. రానున్న రోజుల్లో గ్రామ స్థాయిల్లో కూడా ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# గంజాయి మత్తు జీవితాలు చిత్తు



మేడిపల్లి : గంజాయి మత్తులో జీవితాలు చిత్తవుతున్నాయి. ప్రభుత్వం పటిష్ఠ నిఘా ఉంచినా గంజాయి సరఫరా ఆగడం లేదు. మత్తుకు అలవాటు పడిన యువకులు తీవ్రమైన నేరాలకు పాల్పడటమే కాకుండా ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. బంగారు భవిష్యత్తు కలిగి ఉండాల్సిన వారు అర్ధాయువుతో లోకం వీడుతున్నారు. తల్లిదండ్రుల కళ్లెదుటే యువకులు గంజాయి మహమ్మారి బారిన పడుతుండటం ఆయా కుటుంబాలను బాధిస్తోంది. ఇప్పటికైనా అన్ని స్థాయిల వారు గంజాయి నిర్మూలనకు పాల్పడకపోతే తీవ్రమైన ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

35 ఏళ్ల లోపు వారే అధికం..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో సరాసరి ఇద్దరు మృత్యువాత పడుతున్నారు. ఏడాదిలో 1,000కి పైగా ప్రమాదాల్లో 700 మంది వరకు మృతిచెందుతుండగా అందులో 35 సంవత్సరాల లోపు వారు సగం మంది ఉంటున్నారు. వీరిలో సగానికి పైగా మద్యం మత్తులో, గంజాయితో మృత్యు ఒడికి చేరుతున్నారు. గంజాయి మూలంగా అతివేగంగా వాహనాలు నడుపుతున్నట్లు పోలీసులు గమనించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో కొన్ని ప్రాంతాలను అడ్డాగా చేసుకొని గంజాయి ప్రభావంతో యువకులు మితిమీరి ప్రవర్తిస్తున్నారు. గతేడాది జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలానికి చెందిన ఇద్దరు యువకులు కొడిమ్యాల మండలంలో వాహన ప్రమాదంలో మృతిచెందారు. ఇద్దరూ గంజాయికి అలవాటుపడినట్లు కుటుంబసభ్యులు గమనించారు. ఇలా నాలుగు జిల్లాల పరిధిలో అటు అనారోగ్యానికి గురి కావడం.. ఇటు ప్రాణాలు కోల్పోతుండటం బాధాకరంగా పరిణమించింది.

నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్‌కు చెందిన మేకల శేఖర్ అనే యువకుడు మేడిపల్లి మండలం కొండాపూర్ శివారులో గంజాయి విక్రయించేందుకు వస్తుండగా ఆగస్టు 1న పోలీసులు పట్టుకున్నారు. సదరు వ్యక్తి చాలా రోజులుగా గంజాయి విక్రయిస్తూ పలువురి యువకులను మత్తుకు అలవాటు చేసినట్లు తెలుస్తోంది.

జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాయపట్నం వద్ద ఇద్దరు యువకులు గంజాయి అమ్ముతుండగా జులై 4న పోలీసులు అరెస్టు చేశారు.కరీంనగర్ రాంనగర్ ప్రాంతంలో జులై 5న గంజాయి అమ్ముతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి, కొడిమ్యాల మండలం సూరంపేటకు చెందిన వారిగా నిందితులను గుర్తించారు. ఏపీలోని సీలేరు నుంచి గంజాయి తెచ్చి అమ్ముతున్నట్లు నిందితులు పోలీసుల విచారణలో తెలిపారు

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో కొందరు యువకులు గతేడాది ఏటీఎం అద్దాలు పగలగొట్టి వాటితోనే ఒకరిపై మరొకరు దాడులు చేసుకున్నారు. గంజాయి మత్తులో తామేం చేస్తున్నామో మరిచిపోయి అతిగా ప్రవర్తించారు.

కరీంనగర్ జిల్లా మానకొండూర్‌కు చెందిన ఇద్దరి మధ్య భూమి విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవ చిలికి చిలికి గాలివానలా మారి హత్యకు దారి తీసింది. నిందితులు గంజాయి మత్తులో హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. బంగారు భవిష్యత్తు కలిగిన యువకులు గంజాయి మత్తులో జీవితాలు చిత్తు చేసుకున్నారని కుటుంబసభ్యులు ఆవేదన చెందారు.

మేడిపల్లి మండలానికి చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తల్లిదండ్రులు ఆర్థికంగా చితికిపోవడంతో చివరి వరకు ఆసరాగా ఉంటాడని భావించారు. కానీ యువకుడు గంజాయి మత్తుకు అలవాటుపడి అతివేగంగా వాహనం నడిపి ప్రమాదానికి గురయ్యాడు. తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స పొందుతూ రెండు నెలల క్రితం మృతి చెందాడు. పేద తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చాడు.

డీఅడిక్షన్ సెంటర్లేవీ

మద్యం, గంజాయి మత్తు నుంచి పిల్లలను కాపాడుకునేందుకు తల్లిదండ్రులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేవలం కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినా అవి నామమాత్రంగానే పనిచేస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థలకు కూడా డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఓ స్వచ్ఛంద సంస్థ ఈ కేంద్రానికి అనుమతి తీసుకున్నా సిబ్బంది లేకపోవడంతో సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. ప్రైవేటు సంస్థల వారు గంజాయి, మద్యం ప్రభావం నుంచి యువకులను బయటకు రప్పించేందుకు కనీసం మూడు నుంచి తొమ్మిది నెలల పాటు మందులు, కౌన్సెలింగ్ ద్వారా నయం చేస్తున్నారు. ఇవి కూడా వరంగల్, హైదరాబాద్ లాంటి చోట్ల ఉండటంతో ఆర్థిక భారం పడుతోంది.

కుటుంబాల్లో విషాదం నింపొద్దు

యువకులు గంజాయి మహమ్మారి బారిన పడుతుండటం ఆయా కుటుంబాల్లో విషాదం నింపుతోంది. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో యువకులు అతివేగంగా వాహనాలు నడపడమే ఒక కారణంగా తేలింది. మద్యం, గంజాయి మత్తులో ప్రాణాలు కోల్పోతే కుటుంబాలు దిక్కులేనివి అవుతున్నాయి. చాలా మంది యువకులు చదువుకుంటున్న సమయంలోనే నేరాలకు పాల్పడటం, కేసుల్లో ఇరుక్కోవడంతో జీవితాలు వృథాగా మారుతున్నాయి. ప్రభుత్వం గంజాయి లాంటి మత్తుపదార్థాల నివారణకు కృషి చేస్తుండటంతో పోలీసుశాఖ కూడా పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసింది. ప్రజలు గంజాయి నిర్మూలనకు సహకరించాలి.

ఉమామహేశ్వర్ రావు, డీఎస్పీ, మెట్‌పల్లి

# నిత్యం లీకులు.. తప్పని అతుకులు



పెద్దపల్లి : 'మూడు లీకులు.. ఆరు అతుకులు' అన్న చందాన మారింది పెద్దపల్లి పట్టణంలో మిషన్ భగీరథ పథకం తాగునీటి సరఫరా పరిస్థితి. పైపులైన్ల నిర్మాణం పూర్తి చేసిన మూడేళ్ల తర్వాత నీటి సరఫరా ప్రారంభించారు. మొదట్లో ఇంటింటికీ నల్లాలు బిగించలేదనే కారణంతో ఏడాది కిందట వినియోగంలోకి తీసుకొచ్చారు. కాగా అప్పటికే ఇళ్ల లోపలికి వేసిన పైపులు ధ్వంసం కావడం, లైన్ల నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో లీకేజీలు పరిపాటిగా మారాయి. దీంతో మున్సిపల్ అధికారులు పట్టణంలోని కొన్ని ప్రాంతాలకు సరఫరా నిలిపివేసి, పాత లైన్ ద్వారా సరఫరా చేస్తున్నారు. ఇక మున్సిపాలిటీలో పైప్‌లైన్ల మరమ్మతులకే మూడు బృందాలు పని చేస్తున్నాయి. వీరు రోజుకు మూడు లీకేజీల చొప్పున అతుకులు వేస్తున్నారు. మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యంతో లీకేజీల మరమ్మతు మున్సిపాలిటీకి భారంగా మారింది. లీకేజీలు వేసిన చోటే పదే పదే పైపులు పగిలిపోతున్నాయి.

పథకాలు మారినా అదే సమస్య

పెద్దపల్లి పట్టణానికి పదేళ్ల కిందటి వరకు హుస్సేన్‌మియా వాగు నుంచి నీటి సరఫరా జరిగేది. అప్పట్లో పట్టణంలోని పైపులైన్లకు లీకేజీలుండగా కొత్త పథకంలో పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ఈ మేరకు బొంపల్లి శుద్ధి కేంద్రం నుంచి హైదరాబాద్ తాగునీటి అవసరాలకు తరలించే గోదావరి నీటి పైపులైన్ నుంచి పట్టణానికి మళ్లించారు. అప్పటికీ పట్టణంలో లీకేజీల సమస్యకు అడ్డుకట్ట పడలేదు. అనంతరం మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం అందుబాటులోకి రావడం, పైప్‌లైన్ల నిర్మాణం కూడా పూర్తి కావడంతో లీకేజీల బెడద పోతుందనుకున్నా సమస్య తీవ్రత మరింత పెరిగింది. నీటి సరఫరా ప్రారంభించగానే రహదారులు జలమయమవుతున్నాయి. తారు రోడ్డు నుంచి కూడా నీరు బయటకు వస్తుండటం పైపులైన్ల నిర్మాణ తీరుకు అద్దం పడుతోంది.

పట్టణంలో కుళాయిల సంఖ్య : 11,300

మొత్తం పైప్‌లైన్ పొడవు : 120 కిలోమీటర్లు

లీకేజీలు: లెక్కలేనన్ని..

మరమ్మతులు: మూడు బృందాల ఆధ్వర్యంలో రోజుకు ఆరు

లీకేజీల వ్యయం: రోజుకు సగటున రూ.2000

రూ.25 కోట్లు మంజూరయ్యాయి

పెద్దపల్లి మున్సిపాలిటీకి అమృత్ 2.0 పథకం ద్వారా రూ.25 కోట్ల నిధులను కేంద్రం మంజూరు చేసింది. ఈ నిధులతో మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలకు మరమ్మతుతో పాటు తాగునీటి సరఫరాలోని ఇబ్బందులన్నింటికీ శాశ్వతంగా పరిష్కరిస్తాం.ఆకుల వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్

# వంతెనలు నిర్మించరు.. కష్టాలు తీర్చరు!

గంగాధర : దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరాయి. నూతనంగా నిర్మించిన వారధులు అసంపూర్తిగా నిరుపయోగంగా మారాయి. ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఆయా గ్రామాలను కలిపే ప్రధాన రహదారులపై వంతెనలు సమస్య వచ్చినప్పుడే తాత్కాలిక మరమ్మతులతోనే సరిపుచ్చుతున్నారు. వానాకాలంలో భారీ వరదలకు తెగిపోతున్న వంతెనలతో ప్రజలు ఆగమవుతున్నారు. జిల్లాలోని శిథిలమైన వంతెనలపై కథనం.భూసేకరణలో జాప్యం..రామడుగులోని పురాతన వంతెన ఇది. శిథిలావస్థకు చేరింది. ఒక వైపు వాహనాలు వస్తే.. రెండో వైపు వాహనాలు నిలపాల్సిన దుస్థితి ఉంది. రామడుగు, పెగడపల్లి, గొల్లపల్లి, మండలాలకు ఈ మార్గం గుండా సుమారు 50 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు.

వానాకాలంలో వర్షాలకు మట్టి కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోతుంటాయి. ఆరేళ్ల కిందట రూ.7.9 కోట్లతో నూతన వంతెన నిర్మాణం చేపట్టారు. దీనికి ఇరువైపులా కొంత భూసేకరణ చేపట్టాల్సి ఉంది. 1.33 గుంటల స్థలాన్ని సేకరించేందుకు నిర్ణయించినా బాధితులకు పరిహారం చెల్లించడంలో జాప్యం చేస్తున్నారు. ఫలితంగా వంతెన పూర్తయినా వినియోగంలోకి రానిపరిస్థితి. భారీ వరదలు వస్తే శిథిల వంతెన కూలిపోయే ప్రమాదముంది. రక్షణ గోడ లేకపోవడం, పెద్ద గుంతలతో వాహనదారులకు అగ్నిపరీక్షగా మారింది.

కరీంనగర్–వరంగల్ దారిలో..

కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిపై కాలువ బ్రిడ్జీలు ప్రమాదకరంగా మారాయి. హుజూరాబాద్ మున్సిపల్ పరిధి కొత్తపల్లి–ఇందిరానగర్, కేసీ క్యాంపు సమీపంలోని కాకతీయ ప్రధాన కాలువలపై వంతెనలు నిర్మించారు. వీటి మీదుగా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సైడ్ బర్మ్‌లు కొన్ని చోట్ల విరిగిపోయాయి. మరికొన్ని చోట్ల ఇనుప చువ్వలు తేలాయి. బ్రిడ్జీలకు రెండు వైపులా మొక్కలు, చెట్లు పెరిగాయి. వంతెనలకు శాశ్వత సైడ్ బర్మ్‌లను నిర్మించి, ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

రెయిలింగ్ లేక ప్రమాదకరంగా..

గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి లోలెవల్ వంతెన ఇది. గంగాధర–పెగడపల్లి ప్రధాన రహదారి ఇది. ఈ రెండు మండలాలతోపాటు రామడుగు, మల్యాల మండలాల్లోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల వేలాదిగా వెళ్తుంటాయి. నారాయణపూర్ జలాశయం నుంచి వచ్చే వరదలతో వంతెన పూర్తిగా మునిగిపోయి రాకపోకలు స్తంభిస్తాయి. అనంతరం తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరిస్తున్నారు. గత ప్రభుత్వం రూ.3.75 కోట్ల నిధులు కేటాయించగా అప్పటి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ 15 నెలల కిందట పనులకు శంకుస్థాపన చేశారు. గుత్తేదారు అగ్రిమెంట్ కూడా చేసుకోగా ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. వంతెన పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాలు తొలగించకపోవడంతోనే పనులు ప్రారంభించలేదని తెలిసింది. విద్యుత్తు, ఆర్అండ్‌బీ శాఖల మధ్య సమన్వయలోపంతో పనులు ముందుకు వెళ్లడంలేదు. మల్యాల, పెగడపల్లి మండలాల మీదుగా తిరిగిరావాలంటే అదనంగా 25 కి.మీకు పైగా ప్రయాణం చేయాల్సి వస్తోంది.

# వణికిస్తున్న వైరల్ జ్వరాలు

మెట్‌పల్లి: వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా జ్వరాలు వణికిస్తున్నాయి. జ్వరం, నొప్పులతో రోగులు ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. పల్లె దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆసుపత్రులు జ్వర బాధితులతో కిటకిటలాడుతు న్నాయి. కొందరు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. కొన్ని చోట్ల ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురు జ్వరంతో బాధపడుతున్నారు. జ్వరాల గుర్తింపునకు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు సర్వే చేపడుతున్నారు. ఇప్పటి వరకు రెండు సార్లు సర్వే చేయగా ప్రస్తుతం మూడో విడత జ్వర సర్వే కొనసాగుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు 119 డెంగీ కేసులు నమోదైనట్లు వైద్యారోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఆసుపత్రుల్లో పలు రకాల మందుల కొరత కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

మెట్‌పల్లి ఆసుపత్రికి రోగుల తాకిడి

మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి రోగుల తాకిడి ఎక్కువగా ఉంది. వివిధ ప్రాంతాల నుంచి జ్వరాలు, నొప్పులు, విరేచనాలతో రోగులు వచ్చి చికిత్స పొందుతున్నారు. ముప్పై పడకల ఆసుపత్రి అయినప్పటికీ 70 పడకల వరకు సేవలందిస్తున్నారు. జులై నెలలో 140 జ్వరం,



ఆరు డెంగీ, 124 వైడల్ కేసులకు చికిత్స అందించారు. బుధవారం ఆసుపత్రిలో 22 జ్వర, వైడల్ 4, ఏడు డెంగీ బాధితులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం ఒక్కరోజే 301 ఓపీ నమోదైంది. మందుల కొరతజిల్లాలోని పలు సామాజిక ఆసుపత్రులతో పాటు పీహెచ్‌సీలలో మందుల కొరత నెలకొన్నట్లు తెలుస్తోంది. పరిగడపున వేసుకునే, నొప్పుల కోసం ఇచ్చే మందులు కొరత ఉన్నాయి. మందులు అందుబాటులో లేక రోగులు వెనుదిరుగుతున్నారు. చికిత్సకు ఉపయోగించే ఆర్ఎల్(రింగర్స్ లాక్టేట్) సరిపడా లేనట్లుగా సమాచారం. మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి ఆర్ఎల్ అవసరం పడడంతో మంగళవారం సమీపంలోని పీహెచ్‌సీ నుంచి తెప్పించారు. దీన్ని బట్టి కొరత ఏ విధంగా ఉందో తెలుస్తుంది. యాంటీబోయోటిక్స్ కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడం, జ్వరాల సీజన్ కావడంతో మితంగా ఇస్తున్నట్లు రోగులు చెబుతున్నారు.

# కమీషన్లు ఇచ్చుకో.. పనులు పుచ్చుకో

హైదరాబాద్: రోడ్లు, భవనాలు, నాలాలు, ఇతర అభివృద్ధి, నిర్వహణ పనులు అవినీతిమయంగా మారుతున్నాయి. కమీషన్లకు కక్కుర్తిపడి కొందరు అధికారులు గుత్తేదారులకు వంత పాడుతున్నారు. దీంతో పనుల్లో లోపాలు కొద్దిరోజుల్లోనే బయటపడుతున్నాయి. సొమ్ము పంపకాల విషయంలో ఇటీవల శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఇద్దరు అధికారుల మధ్య గొడవ జరగడం గమనార్హం. కొన్ని నెలల కిందట ఎల్బీనగర్, చార్మినార్ జోన్లలోనూ ఇదే పరిస్థితి చోటుచేసుకుంది. 20 శాతం మేర కమీషన్లకే.. ఏ పనులైనా గుత్తేదారులు టెండర్ల ద్వారా దక్కించుకుంటారు. ఇది రెండు రకాలుగా ఉంటుంది. మిగిలిన గుత్తేదారులందరినీ పక్కనపెట్టి, మంచి ధరకు కాంట్రాక్టును అప్పగిస్తే కార్యనిర్వాహక ఇంజినీరుకు (ఈఈ) 10–20శాతం డబ్బు లంచంగా ఇస్తారు. అందరితో పోటీపడి టెండరు దక్కించుకుంటే వేర్వేరు స్థాయిల్లోని ఇంజినీర్లు, ఆడిట్ అధికారులకు వేర్వేరు శాతాల్లో కమీషన్లు ముట్టజెప్పుతారు. సహాయ ఇంజినీరుకు 3–4, డిప్యూటీ ఈఈకి 2–3, ఈఈకి 1–3, హెచ్‌డీకి 0.5, డీఓ(డ్రాఫ్టింగ్ ఆఫీసర్) 0.5, ఆడిట్‌లో 2, చెక్ సెక్షన్‌లో 2–4, ఎగ్జామినర్‌కు 1–2శాతం కమిషన్ ఇవ్వాల్సి ఉంటుందని ఓ సీనియర్ ఇంజినీరు తెలిపారు. వీరంతా కలిసి కొంత మొత్తాన్ని ప్రతినెలా కొందరు ఎస్ఈలకు ఇస్తుంటారని



చెప్పారు. అత్యవసర పనులైతే.. వర్షాలొచ్చినప్పుడు రోడ్లపై గుంతలను పూడ్చటం, దెబ్బతిన్న మ్యాన్‌హోళ్లు, కాలిబాటలకు మరమ్మతులు, శ్మశానవాటికల్లో చెట్లు నరకడం, ప్రార్థనా మందిరాల వద్ద లైటింగ్ పనులు, ఇతర పండగల ఏర్పాట్లు, వర్షాకాల అత్యవసర బృందాలు (ఎంఈటీ), సత్వర మరమ్మతు బృందాలు (ఐఆర్‌టీ), నిర్మాణ వ్యర్థాల తరలింపు, పలు పారిశుద్ధ్య పనులు, నాలాల్లో పూడికతీత, పైపులైన్లకు మరమ్మతులు, తదితర నిర్వహణ పనులు అధ్వానంగా మారాయి. ఓ వీధిలో మ్యాన్‌హోల్ మూతకు మరమ్మతు చేస్తే.. చుట్టుపక్కల పది మ్యాన్‌హోళ్లకు అదే ఫొటో పెట్టి బిల్లులు పెడుతుంటారు. ఒక మ్యాన్‌హోల్ మూతకు బల్దియా రూ.2వేలు ఇస్తుంది. చిన్న చెట్టును నరికితే రూ.5 వేలు, పెద్దదైతే రూ.20వేల బిల్లు ఉంటుంది.

# జంట జలాశయాలకు పునరుజ్జీవం

హైదరాబాద్: చారిత్రక జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పునరుజ్జీవం పొందనున్నాయి. గోదావరి రెండో దశ ప్రాజెక్టుకు తాజాగా ప్రభుత్వం పచ్చజెండా ఊపిన నేపథ్యంలో ఈ రెండు తటాకాల దశ తిరగనుంది. మండు వేసవిలో కూడా జలాశయాల్లో నీళ్లు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తాజాగా మల్లన్నసాగర్ నుంచి నీటిని తరలించి ఈ రెండు జలాశయాలను నింపనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ప్రాణం పోసుకోనున్నాయి.

మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు 15 టీఎంసీలు.. అక్కడ నుంచి 2200 ఎంఎం డయాతో 58 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉస్మాన్‌సాగర్‌కు 5 టీఎంసీలు తరలించనున్నారు. తొలుత ఉస్మాన్‌సాగర్ నింపి అక్కడ నుంచి హిమాయత్‌సాగర్‌ను నింపనున్నారు.వీటిని నింపిన తర్వాత కొంత నీటిని మూసీ ప్రక్షాళనకు కిందకు విడిచి పెట్టనున్నారు. మరికొంత నీటిని ఈ రెండు జలాశయాల చుట్టూ పక్కల ఉన్న ప్రాంతాలకు తరలించనున్నారు.జలమండలి ప్రస్తుతం ఓఆర్ఆర్ చుట్టూ మంచినీటి పైపులైన్ల విస్తరణ పనులు చేపడుతోంది. కొన్ని ప్రాంతాలకు తాగునీటిని అందిస్తున్నప్పటికీ అనేక మున్సిపాలిటీల్లో నాలుగైదు రోజులకు ఒకసారి సరఫరా జరుగుతోంది. నీటి సరఫరా సరిగా లేకపోవడమే ప్రధాన కారణం. గండిపేట వద్ద 120ఎంఎల్‌డీ, రాజేంద్రనగర్ వద్ద 70ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

# ఎంతొస్తే అంతే

హైదరాబాద్ : నగర వ్యాప్తంగా లక్షలాది మంది గృహజ్యోతి అమలుకాక సతమతమవుతున్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగించే వారికి ఈ పథకం వర్తిస్తుంది. ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలనే నిబంధన పెట్టారు. ఇవన్నీ ఉన్నా సున్నా బిల్లులు ఇవ్వకపోవడంతో నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారు.
డాటా ఎంట్రీ కాకపోవడంతోనే అర్హులకు సున్నా బిల్లులు రావడం లేదు. అప్పట్లో హడావుడిగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇటీవల విద్యుత్తు అధికారులు క్షేత్రస్థాయిలో వినియోగదారులతో సమావేశమైనప్పుడు సున్నా బిల్లులు రావడం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ప్రజాపాలన నమోదు పోర్టల్‌ను ప్రణాళికా విభాగం చూస్తోంది. పాతబస్తీ లాల్‌దర్వాజకు చెందిన లత డిసెంబరులో ప్రజాపాలనలో గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అన్ని అర్హతలున్నా ఇప్పటివరకు పథకం అమలు కావడం లేదు.
బడంగ్‌పేటలో గత నెలలో మంత్రి శ్రీధర్‌బాబు పర్యటించారు. అక్కడి మహిళలను పలకరిస్తే గృహజ్యోతి రావడం లేదని సభలోనే బహిరంగంగా చెప్పారు. మూడు జిల్లాల్లో కలిపి సున్నా బిల్లు కోసం 19.8 లక్షల మంది ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. ఒక్క జీహెచ్‌ఎంసీ పరిధిలోనే 14.04 లక్షల దరఖాస్తులు వచ్చాయి.




అసెంబ్లీలో ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం జులైలో 42.25 లక్షలమందికి సున్నా బిల్లులు ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో పరిధిలో 7.40 లక్షల మంది సున్నా బిల్లులు పొందుతున్నారు.
గృహజ్యోతి బిల్లుల సగటు రూ.300-400 మధ్య ఉంది. వినియోగంలో హెచ్చుతగ్గులను బట్టి ప్రతి నెలా మారుతోంది. జులైలో ఒక్కొక్కరికి కలిగిన సగటు ప్రయోజనం రూ.363గా ఉంటే జూన్‌లో రూ.393గా ఉంది. 7.40 లక్షల మందికే సున్నా బిల్లులు వస్తున్నాయి. మరో రెండున్నర లక్షల మంది అర్హతలున్నా బిల్లులు చెల్లిస్తున్నారు.

బాహ్యవలయ రహదారి వెలుపల సబర్బన్ ప్రాంతాలు
గ్రేటర్‌లో విలీనంపై మున్సిపల్ అధికారుల కసరత్తు

# ఒకటా.. రెండా?


హైదరాబాద్: బాహ్యవలయ రహదారి వరకు జీహెచ్‌ఎంసీ పరిధిని విస్తరించే విషయంలో ఆస్కీ (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) సాయాన్ని తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న బల్దియాను విస్తరణతో ఒకటిగానే ఉంచాలా.. రెండింటిగా కొనసాగించాలా అన్న దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో ఆస్కీ అధ్యయనం చేయనుంది.
ఈ నెలలోనే నివేదికఆస్కీ నగరం చుట్టుపక్కల ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో వాస్తవ పరిస్థితి ఎలా ఉంది. అక్కడ ఎలాంటి అభివృద్ధి చేయాలనే ప్రణాళికతోపాటు క్షేత్రస్థాయి పరిస్థితులపై ఈ సంస్థ ఈ నెలలోనే నివేదికను ఇవ్వనుంది. దీని ఆధారంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెలలో లేదా సెప్టెంబరులో బల్దియా విస్తరణపై అధికారికంగా నిర్ణయం తీసుకుంటారని ఓ సీనియర్ అధికారి తెలిపారు. సీఎం అమెరికా పర్యటన ముగించుకొని వచ్చిన తరువాత దీనిపై కీలకమైన సమీక్ష ఉంటుందని అధికారులు చెబుతున్నారు.
చిక్కుముడులన్నీ పరిష్కరించాకే..విస్తరణలో భాగంగా ఓఆర్‌ఆర్ వరకు ఏడు కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీలు, కొన్ని గ్రామాలు ఇందులో కలవబోతున్నాయి. వీటన్నింటినీ కలిపి ఒకే కార్పొరేషన్‌గా కొనసాగిస్తే పాలనాపరంగా అనేక ఇబ్బందులు వస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల సీఎం వద్ద జరిగిన సమావేశంలోనూ దీనిపై చర్చ జరిగింది. కొన్ని గ్రామాలను కలిపే విషయంలో న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అంటున్నారు. ఈ చిక్కుముడులన్నీ పరిష్కరించిన తరువాత తుది నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారు. ఇప్పటికే బల్దియాలో కలిసే కార్పొరేషను, మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు జరగడం లేదు. బల్దియాలో వీటన్నింటినీ కలిపితే కనీసం అయిదేళ్లపాటు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తేనే ఫలితం ఉంటుందని చెబుతున్నారు.

## గ్రామాలనూ కలిపేద్దామా!.. గ్రేటర్‌లో విలీనంపై కసరత్తు

హైదరాబాద్: బాహ్యవలయ రహదారి లోపలున్న పట్టణాలు, నగరాలను హైదరాబాద్ మహానగరపాలక సంస్థలో విలీనం చేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదనపై మున్సిపల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. సమీపంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేయడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదు.. బాహ్యవలయ రహదారికి అటూ ఇటూ ఉన్న పట్టణాల విషయంలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఔటర్‌కు సమీపంలోని ఒక మున్సిపాలిటీలో నాలుగు ప్రాంతాలు ఓఆర్‌ఆర్ లోపల, రెండు వెలుపల ఉన్నచోట్ల విలీన ప్రక్రియ ఎలా అనే అంశంపై అధికారులు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. లోపలున్న గ్రామాల పరిస్థితులపై ఆరా...
గ్రేటర్‌లో విలీనం కానున్న 14 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో సింహభాగం బాహ్యవలయ రహదారి లోపలున్నాయి. మున్సిపాలిటీలతో సంబంధం లేకుండా కొన్ని పంచాయతీలు ఉన్నాయి. శంషాబాద్ మున్సిపాలిటీలో 4 గ్రామాలు, తుక్కుగూడ మున్సిపాలిటీలో మూడు, పెద్దఅంబర్‌పేట్‌లో 2, ఘట్‌కేసర్‌లో 3, తూంకుంటలో 4 గ్రామాలను విలీనం చేస్తే ఎలా ఉంటుందన్న సమాచారాన్ని సేకరిస్తున్నారు.
ఔటర్ పరిధి దాటితే ఎలా?
నిబంధనల ప్రకారం బాహ్యవలయ రహదారికి వెలుపల ఉన్న గ్రామాలను విలీనం చేయకూడదు. ఆ గ్రామాలు, ప్రాంతాలు మున్సిపాలిటీల్లో ఉండటంతో విలీనం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఔటర్ వెలుపల ఉన్న గ్రామాలనూ విలీనం చేస్తే... వాటికి సమీపంలోని ప్రాంతాలు, ఇతర గ్రామాల ప్రజలు కూడా డిమాండ్ చేస్తే ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతాయన్న అంశాలను పరిశీలిస్తున్నారు. అందుకే వాటిని మళ్లీ నగర పంచాయతీలుగా పరిగణించాలని భావిస్తున్నారు. శివారు మున్సిపాలిటీలతో పాటు తమ గ్రామాలనూ విలీనం చేయాలని కొన్ని నగర, పంచాయతీల నుంచి అభ్యర్థనలు అందుతున్నాయి.

# వాణిజ్య నల్లా.. అక్రమాలే నిలువెల్లా

హైదరాబాద్: నగరంలోని వాణిజ్య నల్లాల్లో మాయాజాలం కొనసాగుతూనే ఉంది. ఈ కుళాయిలు గ్రేటర్ వ్యాప్తంగా 53 వేలే ఉన్నాయని లెక్కలు చెబుతుండటమే అందుకు నిదర్శనం.. గృహ కేటగిరీ ముసుగులో భారీగా వాణిజ్య నల్లాల బిల్లులు ఎగవేస్తున్నట్లు జలమండలి అనుమానిస్తోంది. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని నిర్ణయించింది. గ్రేటర్‌లో సుమారు 14 లక్షల నల్లా కనెక్షన్లు ఉన్నాయి. భారీ పరిశ్రమలు, మాల్స్, ఇతర వ్యాపార సముదాయాలకు ఇచ్చే నల్లాలను వాణిజ్య కేటగిరీ కింద బిల్లులు వసూలుచేస్తున్నారు. వీటికి నల్లా ఛార్జీలు దాదాపు మూడు, నాలుగురెట్లు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం జలమండలికి నెలవారీగా వస్తున్న ఆదాయంలో 70 శాతం వాణిజ్య నల్లాలతోనే సమకూరుతోంది. గ్రేటర్‌లోని వాణిజ్య కేటగిరిలో లెక్కలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన కుదరడం లేదని అధికారులు భావిస్తున్నారు. విద్యుత్తు శాఖకు సంబంధించి గ్రేటర్‌లో 6 లక్షల వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. ఇక బల్దియా.. 2.6 లక్షల వాణిజ్య భవనాల నుంచి ఆస్తి పన్ను వసూలుచేస్తోంది. ఈ లెక్కన.. జలమండలి పరిధిలో భారీగా వాణిజ్య కేటగిరీ నల్లాలుండాలి. కొన్ని వ్యాపార సముదాయాలకు నల్లాలు లేకపోవడం, లేదంటే ఒకే నల్లా కనెక్షన్ కింద రెండు, మూడు సముదాయాలు ఉండటంతో కొంతవరకు తగ్గే అవకాశమున్నా.. ఇంత భారీ తేడా ఉండదని అధికారులు భావిస్తున్నారు.
**ఇదీ పరిస్థితి..**
కొత్త నల్లా కనెక్షన్ తీసుకునే సమయంలో దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి. అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు ఆరా తీయాలి. కొందరు భవనాల యజమానులతో కుమ్మక్కవుతూ కేటగిరీలు సైతం మార్చేస్తున్నారు. దీంతో వాణిజ్య కేటగిరీ నల్లాలపై కచ్చితమైన లెక్కలు తేలడం లేదు.



ప్రస్తుతం ప్రతి గృహ నల్లాకు నెలకు 20 వేల లీటర్ల ఉచిత నీళ్లు సరఫరా చేస్తుండటంతో వాటి నుంచి బోర్డుకు ఆదాయం రావడం లేదు. మొత్తం రూ.90-100 కోట్ల ఆదాయంలో రూ.30-40 కోట్ల వరకు కోత పడుతోంది. ఆ లోటును వాణిజ్య కేటగిరి నల్లాలతో జలమండలి పూడ్చుకుంటోంది.
కేవలం వాణిజ్య నల్లాలతోనే రూ.70 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. అందుకే ఈ విభాగం నల్లాల లెక్కను కచ్చితంగా తేల్చాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి భావిస్తున్నారు. త్వరలో ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. ప్రతి నల్లా పరిశీలించి అది ఏ కేటగిరిలో ఉందో పరిశీలించనున్నారు. గృహ కేటగిరిలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తుంటే వాణిజ్య కేటగిరీలోకి మారుస్తారు.
సర్వే ద్వారా 50 వేల నల్లాలు కొత్తగా ఈ కేటగిరీలోకి చేరితే.. బోర్డు ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. త్వరలోనే కార్యాచరణ చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

# గనుల్లో.. ఘనులు!



తాండూరు : జిల్లాలోని సర్కారు భూముల్లో గని నిక్షేపాలపై అక్రమార్కుల కన్ను పడింది. ఎలాంటి అనుమతులు పొందకుండానే యథేచ్ఛగా యంత్రాల గునపాలు భూమాత గుండెలను గాయం చేస్తున్నాయి. రూ.కోట్ల విలువజేసే సహజ సంపద తరలించేందుకు పావులు కదుపుతున్న వైనంపై కథనం.
దేశ విదేశాల్లో ఎనలేని గిరాకీ తాండూరు నాపరాయి నిక్షేపాలకు దేశ విదేశాల్లో గిరాకీ ఉంది. ఇక్కడి 300లకుపైగా గనుల్లో తవ్వకాలతో వెలికి తీసిన నిక్షేపాలను ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాలు, విదేశాలకు నిత్యం తరలిస్తారు. అంతటి ప్రాధాన్యమున్న నాపరాయిని కొందరు అప్పనంగా తవ్వుకుపోయేందుకు సన్నాహాలు ప్రారంభించారు. తాండూరు మండలం సంగెంకలాన్ శివారు సర్వే సంఖ్య 109లో 127 ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉంది. దీంట్లో దాదాపు 70 ఎకరాల భూమి పచ్చని చెట్లతో అనంతగిరి గుట్టను తలపించేలా అలరారుతోంది. వీటిపై అక్రమార్కుల కన్ను పడింది.
పట్టణానికి చెందిన కొందరు అక్రమార్కులు ఇటీవల జేసీబీలతో రూ.30కోట్లకుపైగా విలువజేసే నాపరాయి తవ్వకాలకు శ్రీకారం చుట్టారు. తొలుత పైనున్న బండరాళ్లను తొలగించేందుకు జిలెటిన్‌స్టిక్స్ అమర్చి యథేచ్ఛగా పేలుళ్లు జరిపారు. బండరాళ్లను తరలించి భూగర్భంలో నిక్షిప్తమైన విలువైన నాపరాళ్లను తవ్వకాలతో వెలికి తీసేందుకు ఏర్పాట్లు చేశారు.
ఏడు శాఖల అనుమతులు పొందకుండానే..: గనుల తవ్వకాలను ఏడు శాఖల నుంచిఅనుమతులు పొందాల్సి ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా పనిచేస్తున్నారు. నిత్యం ఎగుమతులు : లక్ష చదరపు అడుగుల నిక్షేపాలురోజుకు లావాదేవీలు: రూ.50లక్షలు
అనుమతులు లేకుండా కొనసాగుతున్న గనులు: 60కిపైగా
బాధ్యులపై కఠిన చర్యలు..- శ్రీనివాస్‌రావు, ఆర్డీఓ, తాండూరు.
ప్రభుత్వ భూముల్లో నాపరాయి తవ్వకాలకు పాల్పడితే ఉపేక్షించబోం. క్షేత్రస్థాయిలో పరిశీలించి పేలుళ్లు జరిపిన వారిపై చర్యలు తీసుకుంటాం. సర్కారు భూముల్లో గని కార్యకలాపాలు నిర్వహించకుండా నిఘా పెడతాం. తవ్వకాలు నిలిపివేస్తాం..బల్నే సత్యనారాయణ, ఏడీ, గనులు భూగర్భ వనరుల శాఖ, తాండూరు. అనుమతులు పొందకుండా గనులు నిర్వహించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తాం. రెవెన్యూ అధికారులతో కలిసి వెళ్లి ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. చిన్నతరహా ఖనిజాల తవ్వకాలు, ఎగుమతుల పర్యవేక్షణకు మండల పరిషత్ అధికారి, ప్రత్యేకాధికారులకు బాధ్యత కూడా ఉంటుంది.

# స్టాంపు పేపర్ల విక్రయాల్లో అదనపు వసూళ్లు



హుజూరాబాద్ : నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్ల విక్రయాల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. వాటి విలువ కంటే అదనంగా వసూలు చేస్తూ వెండర్లు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలుదారులు అడిగిన మొత్తాన్ని ముట్టజెప్పక తప్పడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరీంనగర్ ప్రధాన రిజిస్ట్రేషన్ కార్యాలయంతో సహా 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటి పరిధిలో 161 మంది అనుమతి పొందిన వెండర్లు ఉండగా జ్యుడీషియల్ స్టాంపులతోపాటు ఫ్రాంకింగ్ యంత్రాల ద్వారా ప్రతి రోజూ సుమారు 20 వేల వరకు వివిధ రకాల స్టాంపు పేపర్లు విక్రయిస్తుండగా రిజిస్ట్రేషన్ల శాఖకు రూ.15 లక్షల ఆదాయం సమకూరుతోంది. రూ.10 విలువ చేసే స్టాంప్ పేపర్ గతంలోనే ప్రభుత్వం రద్దు చేయగా రెండేళ్ల నుంచి రూ.20 పేపర్లు కూడా రావడం లేదు. ప్రస్తుతం వెండర్ల వద్ద రూ.50, రూ.100 విలువ చేసే స్టాంప్ పేపర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. స్టాంప్ పేపర్ల విక్రయాలపై ప్రభుత్వం 5 శాతం కమీషన్ చెల్లిస్తోంది. కానీ వెండర్లు మాత్రం రూ.50 విలువ చేసే దానికి రూ.80, రూ.100 విలువ చేసే స్టాంప్ పేపర్‌కు రూ.140కి పైగానే వసూలు చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి కొందరు రూ.100 స్టాంప్ పేపర్‌ను రూ.150, రూ.50 స్టాంప్ పేపర్‌ను రూ.100 వరకూ విక్రయిస్తున్నారు. తాము అడిగిన మొత్తం ఇవ్వకపోతే స్టాక్ లేవంటూ బుకాయిస్తున్నారు.
ఆన్‌లైన్ విధానం అమలులో ఉన్నా..
స్టాంపుల కొరత, నకిలీ స్టాంపుల విక్రయం, ట్యాంపరింగ్ వంటి సమస్యలకు కళ్లెం పడేలా ఇలాంటి అక్రమాలకు చెక్ పడేలా ప్రభుత్వం గతేడాది ఆన్‌లైన్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. గతంలో స్టాంపులను నేరుగా విక్రయించడం, పాత తేదీలు వేసి విక్రయించడం వంటి మోసాలు జరిగేవి. కొనుగోలుదారుల అవసరాన్ని బట్టి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసేవారు. పైగా ప్రతి రోజూ వెండర్లు ఎన్ని స్టాంపులు విక్రయించారనే కచ్చితమైన లెక్కలు కూడా రిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఉండేవి కావు. వీటిని నియంత్రించేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా స్టాంపు పేపర్లు విక్రయించే విధానాన్ని అమలు చేసింది. తద్వారా కొనుగోలుదారుల వివరాలు, వెండర్లు ఏ రోజు ఎన్ని స్టాంపు పేపర్లు విక్రయించారనే పూర్తి వివరాలన్నీ అంతర్జాలంలో నిక్షిప్తమవుతాయి. ఈ విధానం వల్ల అక్రమాలకు తావుండదని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతుండగా.. అదనపు వసూళ్లకు మాత్రం అడ్డుకట్ట వేయలేకపోతుండటం గమనార్హం. మరోవైపు ఆన్‌లైన్ విధానంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వెండర్లు అంటున్నారు. కంప్యూటర్, ప్రింటర్, అంతర్జాలం సౌకర్యం వల్ల అదనంగా ఖర్చు అవుతుందని, స్టాంప్ పేపర్ల విక్రయాలపై ప్రభుత్వం ఇచ్చే అయిదు శాతం కమీషన్ ఏ మాత్రం సరిపోవడం లేదని చెబుతున్నారు.
కృత్రిమ కొరతతో రెట్టింపు ధర
నిబంధనల ప్రకారం వాస్తవ ధరకే అమ్మాలి. ఒక్క పైసా అదనంగా తీసుకోవద్దు. కానీ ఇదెక్కడా అమలుకు నోచుకోవడం లేదు. ఒక్కోసారి స్టాంప్ పేపర్లకు కృత్రిమ కొరత సృష్టించి వాటి విలువపై రెట్టింపు వసూలు చేస్తున్నారు. ఇదంతా సబ్ రిజిస్ట్రార్ అధికారులకు తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పైగా ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వీటి విక్రయాల కోసం ఒక కౌంటర్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. చాలా చోట్ల సిబ్బంది కొరత సాకుతో స్టాంప్ పేపర్లను వెండర్లకే అందజేస్తున్నట్లు తెలుస్తోంది. వెండర్లు తమ పరపతితో స్టాంప్ పేపర్లను పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి వాటి వాస్తవ విలువ కంటే ఎక్కువగా అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఫ్రాంకింగ్ యంత్రాల ద్వారా స్టాంప్ పేపర్లు విక్రయించేందుకు ఉమ్మడి జిల్లాలో 14 మంది అనుమతి పొందారు. ఫ్రాంకింగ్ చలానా చెల్లించిన వినియోగదారుల నుంచి అదనంగా 10 శాతం వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.
ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం
నాన్ జ్యుడీషియల్ స్టాంపులను వెండర్లు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలి. నిబంధనలను అతిక్రమించి అదనంగా వసూలు చేసే వెండర్ల లైసెన్స్ రద్దు చేస్తాం. కరీంనగర్‌లో కొందరు ఇలాగే చేస్తే వారిని హెచ్చరించి లిఖితపూర్వకంగా వివరణ తీసుకున్నాం. లైసెన్స్ జారీ సమయంలోనే స్టాంపుల విలువ ఆధారంగా విక్రయించాలని, ఒక్కపైసా ఎక్కువ తీసుకోవద్దని చెబుతాం. ఎవరైనా ఎక్కువ తీసుకుంటే నేరుగా మాకు ఫిర్యాదు చేస్తే విచారించి వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రవీణ్‌కుమార్, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్

# డెంగీ.. వణికిస్తోంది..!

ఖమ్మం : నిన్నమొన్నటి వరకు జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు కురిశాయి. అనేక గ్రామాల్లో పారిశుద్ధ్యం దెబ్బతింది. వీధులు బురదమయంగా మారాయి. కాలానుగుణ వ్యాధులు ప్రబలుతున్నాయి. అధికార యంత్రాంగం తక్షణం స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, అవసరమైనచోట్ల వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ అంశంపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతితో మాట్లాడుతూ ప్రతి డ్రైడే నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వైరల్ జ్వరాలు అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో సమీపంలోని 100 కుటుంబాల రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.
**తాండవిస్తున్న అపరిశుభ్రత**
వైరా మండలం కారేపల్లిలో మెయిన్‌రోడ్డు, బీసీ కాలనీ, దళిత కాలనీ, రజక బజారు, బొడ్డురాయి సెంటర్‌లో పారిశుద్ధ్యం దెబ్బతింది. బీసీ కాలనీలోనే 100 మందికి పైగా జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో డెంగీ కేసులు నమోదవుతున్నాయి. మురుగుకాల్వ వ్యవస్థను మెరుగుపరిచి ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయాలని స్థానికులు కోరుతున్నారు.
**ముందస్తు సమాచారం లేకుండానే..!**
సత్తుపల్లి మండలం చెరుకుపల్లి పంచాయతీ పరిధిలోని చెరుకుపల్లి, తుమ్మలనగర్, జగన్నాథపురంలో పారిశుద్ధ్యం దెబ్బతింది. ఇద్దరు, ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్నారు. జలుబు, దగ్గు, విరేచనాలతో మరికొందరు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడిప్పుడే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. జగన్నాథపురంలో సింగరేణి అధికారులు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నప్పటికీ ముందస్తు సమాచారం ఇవ్వటం లేదని పలువురు వాపోతున్నారు.
**ఊరికి జ్వరమొచ్చింది** మధిర మండలం మాటూరుపేటలోని ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో, ఎస్సీకాలనీ, చెరువుకట్ట ప్రారంభ ప్రదేశం, పాఠశాల ప్రాంతంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. చెత్త సేకరణ ట్రాక్టర్లు మూలనపడ్డాయి. చెత్తాచెదారం పేరుకుపోవటం, మురుగుకాల్వలో పూడిక తీయకపోవటంతో అపరిశుభ్రత తాండవిస్తోందని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలో 60 మందికిపైగా జ్వరాలతో బాధపడు తున్నారు.
**మురికివాడల్లో తీవ్ర సమస్య**
ఖమ్మం నగరంలోని బల్లేపల్లి విద్యానగర్, ప్రశాంతినగర్, ప్రకాశ్‌నగర్, సుందరయ్యనగర్, బాలాజీనగర్, కాల్వొడ్డు, మోతీనగర్, రాపర్తినగర్, ఏకలవ్యనగర్, విలీన పంచాయతీల్లోని వివిధ ప్రాంతాలు బురదమయంగా మారాయి. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగి వర్షం నీరు నిలవటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికే వెంకటేశ్వరనగర్, శ్రీనివాసనగర్ పట్టణ ఆరోగ్యకేంద్రాల పరిధిలో పది 'డెంగీ' కేసులు నమోదయ్యాయి.
**పారిశుద్ధ్యం.. అధ్వానం**
తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లిలో అధికారికంగా పది మందికి డెంగీ జ్వరం సోకింది. మరో 20 మంది 'డెంగీ' లక్షణాలతో బాధపడుతున్నారు. సుమారు 100 మందికి కాలానుగుణ వ్యాధులు ప్రబలాయి. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో కొద్దిరోజుల క్రితం వైద్యశిబిరం నిర్వహించగా మళ్లీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఇటీవల గ్రామాన్ని సందర్శించి తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినా పారిశుద్ధ్యం మెరుగుపడలేదని స్థానికులు వాపోతున్నారు.

# ధరణి.. మారింది ధోరణి

ఖమ్మం: 'ధరణి' భూసమస్యల పరిష్కార ప్రత్యేక కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. అనేక చిక్కుముళ్లతో ఏళ్ల తరబడి సతమతమైన ప్రజలకు నాలుగు నెలలుగా సాగుతున్న ఈ ప్రక్రియ ద్వారా పరిష్కార మార్గం లభిస్తోంది. మిస్సింగ్ సర్వే నంబర్లు, భూవిస్తీర్ణంలో తేడాలు, నిషేధిత జాబితాలో నమోదైన భూములు, వారసత్వ భూములు, మ్యుటేషన్లు, గ్రీవెన్స్ ల్యాండ్ మ్యాటర్స్ తదితర సమస్యల పరిష్కారంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వేలాది మంది రైతులకు ఉపశమనం కలుగుతోంది. 'ధరణి' పోర్టల్‌లో ఇప్పటివరకు ఉన్న సమస్యలు కొలిక్కి వచ్చాక బాధితుల నుంచి కొత్తగా దరఖాస్తులను రెవెన్యూ యంత్రాంగం స్వీకరించనుంది. జిల్లాల వారీగా ఏర్పాటుచేసిన 'ధరణి' హెల్ప్‌డెస్కులు.. దరఖాస్తు ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాయి.
**భద్రాద్రి కొత్తగూడెంలో..**భద్రాద్రి జిల్లాలో 14 రకాల భూ సమస్యలకు సంబంధించి 3,194 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో తహసీల్దార్ల వద్ద 315, ఆర్డీఓల దగ్గర 1,181, అదనపు కలెక్టర్ వద్ద 1,024, కలెక్టర్ వద్ద 674 మిగిలిపోయాయి. ఈ దరఖాస్తులన్నింటికీ రెండు వారాల్లో శాశ్వత పరిష్కారం దక్కనుంది.
**ఖమ్మం జిల్లా అదరహో..**రాష్ట్రంలో 'ధరణి' భూసమస్యల పరిష్కారంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాలు గతేడాది అగ్రభాగాన నిలిచాయి. ఏడాది వ్యవధిలో సుమారు 60వేల సమస్యలను అధికారులు పరిష్కరించారు. అయినా 'ధరణి' పోర్టల్‌లో ఒక్క ఖమ్మం జిల్లాలోనే సుమారు 20వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పరిష్కార మార్గంపైనా రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు కొలువుదీరాక కలెక్టర్లతో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ధరణి' పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ఇందుకోసం మార్చి




నుంచి ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టే నాటికి ఖమ్మం జిల్లాలో 12వేల భూసంబంధిత దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో ఇప్పటివరకు టీఎం-33 మాడ్యూల్ ద్వారా 8,500 దరఖాస్తులకు పరిష్కారం లభించింది. మిగిలిన 3,500 దరఖాస్తులకు మోక్షం దక్కాల్సి ఉంది. వీటిలో 2వేల అర్జీలకు సంబంధించి తహసీల్దార్లు, ఆర్డీఓల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యింది. కలెక్టర్ లాగిన్‌లో ఉన్న వీటికి త్వరలోనే పరిష్కార మార్గం లభించనుంది. మిగిలిన 1,500 దరఖాస్తులను రెండు వారాల్లో పరిష్కరించేలా ప్రత్యేక డ్రైవ్ సాగుతోంది.
'ధరణి' భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి అర్జీని రెవెన్యూ అధికారులు సునిశితంగా పరిశీలిస్తున్నారు. దరఖాస్తు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను సంబంధిత వ్యక్తులకు తెలియజేస్తున్నాం. ప్రత్యేక డ్రైవ్‌ను రెండు వారాల్లో పూర్తిచేస్తాం. ధరణి పోర్టల్‌లోని భూసమస్యలన్నింటినీ పరిష్కరించాక కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తాం. సక్రమంగా దరఖాస్తు చేసేందుకు వీలుగా 'ధరణి' హెల్ప్‌డెస్కులు ఉపకరిస్తాయి. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

## పిచ్చుకలపై బ్రహ్మాస్త్రాలా?

కుత్బుల్లాపూర్ : భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు తారతమ్యం ప్రదర్శిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. కబ్జాలకు పాల్పడుతున్నవారు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఎకరాలకు ఎకరాల ప్రభుత్వ భూములను కబళించి ప్లాట్లు చేసి విక్రయిస్తూ రూ.కోట్లకు పడగెత్తుతున్న వారిని వదిలేసి చిన్నాచితకా స్థలాలను కబ్జా చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపి మమ అనిపించుకుంటున్నారు. కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ రికార్డుల ప్రకారం గాజులరామారం 13 సర్వేనంబరులో 5.37 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండాలి. కాని ఇందులో రూ.155 కోట్ల విలువచేసే 5.17 ఎకరాల భూమిని డబ్బు, పరపతి కలిగిన కొందరు కబ్జా చేసి తమ వెంచర్‌లో కలుపుకొన్నారు. ఆనంతరం ఆ స్థలాన్ని 200-250 చదరపు గజాల చొప్పున ప్లాట్లుచేసి ప్రైవేటు పట్టా సర్వే నంబర్లతో ఒక్కో ప్లాటును రూ.కోటి నుంచి కోటిన్నరకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. సంబంధిత దస్తావేజుల ఆధారంగా జీహెచ్ఎంసీ వారు నిర్మాణ అనుమతులు జారీచేయడంతో అందులో బహుళ అంతస్తుల మేడలు వెలిశాయి. దీంతో మిగిలిన అర ఎకరం భూమిపై చిన్నాచితకా భూకబ్జాదరుల కన్ను పడింది. ఇందులో గుడి నిర్మాణం చేయగా మిగిలిన సుమారు 500 చదరపు గజాల స్థలంలో ఇటీవల గదులు



నిర్మించడానికి సన్నద్ధమయ్యారు. రెవెన్యూ అధికారులు అడ్డుకుని బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అయితే రూ.155 కోట్ల విలువచేసే 5.17 ఎరాల భూమిని కబళించిన వారిపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇక్కడ భూకబ్జాలకు పాల్పడిన వ్యక్తులే గాజులరామారం 329లో సుమారు ఎకరం, 12 సర్వేనంబరులో రెండు ఎకరాలు 100 సర్వేనంబరులో 1300 చదరపు గజాల స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లు చేసి విక్రయించినట్లు ఆరోపణలున్నాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

నేను బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి 13 సర్వేనంబరు ప్రభుత్వ భూమిలో ఎటువంటి ఆక్రమణలు జరగలేదు. కాని గతంలో జరిగిన ఆక్రమణలపై అప్పటి తహసీల్దార్ ఆదేశాల మేరకు సంబంధిత భూమిని సర్వే నిర్వహించి కొందరికి ఎన్ఓసీలు జారీచేసినట్లు సమాచారం ఉంది. అయితే తాజాగా ఆ సర్వే నివేదికల ఆధారంగా మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తాం. అందులో ఎవరెవరు ఎంత ఆక్రమించారనేదానిపై ఒక నివేదిక రూపొందించి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. రజనీకాంత్, ఆర్ఐ కుత్బుల్లాపూర్

## సున్నాబిల్లు.. అందక గొల్లు

హైదరాబాద్:గృహజ్యోతి పథకం అమలుకు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఎన్నికలు కాగానే అర్హులకు సున్నా బిల్లు ఇవ్వాలని సూచించినా..ఇంతవరకు అధికారికంగా ఎలాంటి చర్యలు లేదు. నగరంలో మరో 5 లక్షల మంది వినియోగదారులు ఎదురుచూస్తున్నారు. నిత్యం విద్యుత్తు, జీహెచ్ఎంసీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

పాత దరఖాస్తులు ఏమయ్యాయి..?

గృహజ్యోతి పథకం నిరంతర ప్రక్రియ అని.. రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే మరుసటి నెలలో సున్నా బిల్లులు వస్తాయని విద్యుత్తు ఉన్నతాధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. మార్చిలో విద్యుత్తు సిబ్బంది దరఖాస్తుదారుల ఇంటింటికి వెళ్లి విద్యుత్తు బిల్లులకు ఆహార భద్రత కార్డు వివరాలను అనుసంధానం చేశారు. అయినా వీరిలోనూ చాలామందికి సున్నా బిల్లులు రాలేదు. రానివారు మార్చి నెలలో జీహెచ్ఎంసీ ప్రజాపాలన సేవ కేంద్రాలకు వెళ్లి ఆహార భద్రత కార్డుతో కలిపి మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. కొందరికి సవరించిన బిల్లులు జారీ చేశారు. మిగతావారికి ఎందుకు రాలేదు అనేది స్పష్టత లేదు.

ఇదేం తిరకాసు.. అర్హత ఉండి సున్నా బిల్లులు రానివారు ఉంటే జీహెచ్ఎంసీ ప్రజాపాలన సేవా కేంద్రాల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్తు అధికారులు చెబుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తులు తీసుకోవాలని తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని జీహెచ్ఎంసీ అధికారులు చెప్పి పంపిస్తున్నారు.

ఇక్కడ ఇలా : నగరంలో 9 సర్కిళ్ల పరిధిలో గృహ వినియోగదారులు




దాదాపు 50.18 లక్షల మంది ఉన్నారు. వీరిలో 20 లక్షల మంది గృహజ్యోతి పథకానికి డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు జరిగిన ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. ఆహార భద్రత కార్డు తప్పనిసరి చేయడంతో అర్హుల సంఖ్య 12 లక్షలకు తగ్గినట్లు అంచనా. వీరిలో 7.01 లక్షల వినియోగదారులకు మాత్రమే సున్నా బిల్లులు వస్తున్నాయి. అర్హులైన మరో ఐదు లక్షల మంది గృహజ్యోతికి ఎదురుచూస్తున్నారు. తమ దరఖాస్తులకు సంబంధించిన పురోగతిపై సమాచారం ఇచ్చేవారు లేకపోవడంతో.. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్తు అధికారులు చెబుతుండటంతో వీరు జీహెచ్ఎంసీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే మండలకార్యాలయాలను సంప్రదిస్తున్నారు.

ఒకవేళ ఏదైనా కారణంతో దరఖాస్తు ప్రక్రియ మధ్యలోనే ఆగిపోతే ఆ వివరాలు వినియోగదారుడు తెలుసుకునే వ్యవస్థ లేకపోవడం పెద్ద లోపంగా ఉంది. ప్రజాపాలనలో ప్రతి దరఖాస్తుకు ఒక నెంబరు ఇచ్చారు. ఆ వివరాలు నమోదు చేయగానే ఏ దశలో ఉందో తెలిపే వ్యవస్థ వినియోగదారులకు అందుబాటులో ఉంటే ఈ గందరగోళం తప్పుతుంది. సున్నా బిల్లుల వినియోగదారులు

## 20 మండలాలకు ఒకే ఒక్క ఎంఈఓ!




పరిగి : పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం 'మన ఊరు..మన బడి' పేరిట, ప్రస్తుతం 'అమ్మ ఆదర్శ పాఠశాలల' పేరుతో అభివృద్ధి పనులు చేపడుతోంది. మరోవైపు బడి ఈడు కలిగిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు 'బడిబాట' నిర్వహిస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా పాఠశాలల పనితీరును పరిశీలన, పర్యవేక్షించే అధికారులు లేకపోవడంతో నిర్వహణ గాడితప్పుతోంది.

ఇన్‌ఛార్జులుగా ప్రధానోపాధ్యాయులు

జిల్లాలోని 20 మండలాలకు 20మంది మండల విద్యాధికారులు (ఎంఈఓ) ఉండాలి. కానీ ఒకే ఒక్కరు మాత్రమే పూర్తిస్థాయి ఎంఈఓగా పనిచేస్తున్నారు. మిగతా మండలాలకు ప్రధానోపాధ్యాయులే ఇన్‌ఛార్జిలుగా వ్యవహరిస్తున్నారు. అదనపు బాధ్యతల కారణంగా వారు ఎటూ న్యాయం చేయలేకపోతున్నామని వాపోతున్నారు. జిల్లా ఉప విద్యాధికారి పోస్టులు కూడా ఖాళీగా ఉండటం శోచనీయం పాఠశాలలు పు:న ప్రారంభమైన నేపథ్యంలో కనీసం ఈ ఏడాదైనా సిబ్బంది భర్తీకి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

85వేల మందికి పైగా విద్యార్థులు

పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో 776 ప్రాథమిక, 116 ప్రాథమికోన్నత, 176 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా సుమారు 85వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఎంఈఓలు లేక పాఠశాలల నిర్వహణ గాడి తప్పుతోందని గతం నుంచి ఫిర్యాదులు అందుతున్నా క్షేత్రస్థాయిలో పరిశీలించి పట్టించుకునే వారు లేకుండా పోయారు. దోమ మండల విద్యాధికారిగా పనిచేస్తున్న హరిశ్చందర్ పరిగి, పూడూరు మండలాలకు సైతం అదనపు బాధ్యతలను నిర్వహించాల్సి వస్తోంది.

పదిలో ర్యాంకు నానాటికీ తీసికట్టు

పర్యవేక్షణ ప్రభావం ఫలితాలపై పడింది. నెల రోజుల క్రితం వెలువడిన పదో తరగతి ఫలితాలు ఈసారి కూడా నిరాశాజనకంగానే ఉన్నాయి. ఈసారి 13,357 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా కేవలం 8695 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 2022-23 విద్యా సంవత్సరంలో 13,399 పరీక్షలకు హాజరైతే 7967 మంది పాసయ్యారు. గత రెండేళ్లుగా వరుసగా వెనుకబడి పోతుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇరవై ఏళ్లుగా భర్తీలు లేవు పి.సత్యనారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, టీయూటీఎఫ్2005లో పదోన్నతులు ఇచ్చారు. ఇరవై ఏళ్లుగా ఎంఈఓ పోస్టులు భర్తీ చేయడం లేదు. పర్యవేక్షణ లోపంతో శాఖాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. అంతేగాకుండా పాఠశాల అభివృద్ధికి ప్రధాన అవరోధంగా మారింది. సత్వర నిర్ణయాలకు విపరీత జాప్యం జరగడం కూడా ఫలితాలపై ప్రభావం ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ పడుతోంది. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది రేణుకాదేవి, జిల్లా విద్యాధికారిణి

పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పాఠశాలల నిర్వహణలో సమస్యలు రాకుండా ఉండేందుకు సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఇన్‌ఛార్జిలుగా నియమించాం. ఈసారి పది ఫలితాలపై ముందునుంచే మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఉత్తమ ఫలితాలను సాధిస్తాం.

## సమావేశాలే లేవు.. సమస్యల పరిష్కారమెలా..?



పరిగి :ప్రజలకు చిన్నపాటి అనారోగ్యం వచ్చినా వెంటనే గుర్తొకొచ్చేది సర్కారు ఆసుపత్రి. వీటిలో సౌకర్యాలు బాగుంటే పేదలే కాదు, ఉన్నతాదాయ వర్గాలు కూడా వస్తారు. అందుకోసమే ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్)లను ఏర్పాటుచేసింది. ఇవి ఆసుపత్రుల బాగోగుల గురించి ప్రతి మూడు నెలలకోసారి సమావేశాలను నిర్వహించాలి. అవసరమైన సదుపాయాలపై చర్చించాలి. కానీ ఈ కమిటీల జాడ ఎక్కడా కనిపించడంలేదు. దీంతో జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ గాడి తప్పుతోందనే విమర్శలొస్తున్నాయి. దీనికి సంబంధించి కథనం.

ప్రజా ప్రతినిధులే ఛైర్మన్లు

జిల్లా ఆసుపత్రులకు జడ్పీ ఛైర్మన్లు, నియోజక వర్గాల్లో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాలకు ఎమ్మెల్యేలు, పుర ఛైర్మన్లు, పీహెచ్‌సీలకు ఎంపీపీలు ఛైర్మన్లుగా వ్యవహరిస్తారు. ఈ కమిటీల్లో స్థానికంగా ఉన్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. జడ్పీ ఛైర్మన్లు, ఎంపీపీల పదవీ కాలం కొద్ది రోజుల్లో ముగియనుంది. జిల్లాలో నాలుగు నియోజక వర్గాలకు కొత్తగా ఎమ్మెల్యేలు వచ్చారు. కనీసం వీరైనా పట్టించుకుంటారా అని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తునారు. సరైన పర్యవేక్షణ లేక సిబ్బంది ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు. పారిశుద్ధ్యం పట్టించుకోవడంలేదన్నారు.

దోమ, పూడూరు తదితర మండలాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు శిథివాస్థలకు చేరాయి. ఎప్పుడో మండల వ్యవస్థ ఏర్పడినప్పుడు నిర్మించిన భవనాలే నేటికీ కొనసాగుతున్నాయి.

వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనూ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

నిధుల మంజూరేదీ..

ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రభుత్వం నుంచి సరిపడా నిధులు మంజూరు కావడంలేదు. దీంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా నిధుల కొరతతో సమావేశమైనా ఫలితం ఉండదనే భావనతో ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పీహెచ్‌సీలకు ఏటా రెండు పర్యాయాలు కలిపి సుమారు రూ.1.50 లక్షలు నిధులు మంజూరు చేస్తారు. అభివృద్ధి కమిటీ ఆమోదం మేరకు ఈ నిధులు వసతుల కల్పనకు వినియోగిస్తారు.

తాగునీటి వసతి లేదు.. వార్డులు అపరిశుభ్రం

వికారాబాద్‌లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 23 ఉన్నాయి. జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో సరిపడా మందులు అందుబాటలో లేక రోగులు అవస్థలు పడుతున్నారు. తాగునీటి వసతి సక్రమంగా లేదు. పలుచోట్ల ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు పనిచేయటం లేదు. ప్రధాన వార్డుల్లో పరిసరాలు అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి.

మందుల కొరత ఎక్కడా లేదు: డాక్టర్ పల్వన్‌కుమార్, జిల్లా వైద్యాధికారి, వికారాబాద్.

జిల్లాలో దాదాపుగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కారణంగా ఈ ఆరు నెలల పాటు కొన్నిచోట్ల సమావేశాలు జరగలేదు. ఏ ఆసుపత్రిలోనూ మందుల కొరత లేదు. రోగులకు అవసరమైనవి పూర్తి స్థాయిలో ఉన్నాయి.

జిల్లా వైద్య వ్యవస్థ స్వరూపం

జిల్లా ఆసుపత్రి: 1, సామాజిక ఆరోగ్య కేంద్రాలు: 3

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి: 1

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 23

బస్తీ దవాఖాలు: 4

అర్బన్ దవాఖానాలు: 2

## పట్టు పట్టాలి.. ప్రాజెక్టులు సాధించాలి

హైదరాబాద్: ప్రజారవాణాతోనే విశ్వనగర కీర్తి ముడిపడి ఉందని నమ్మిన పాలకులు, నగర అభివృద్ధి సంస్థలు అనేక ప్రణాళికలు చేశాయి. అందులో భాగంగానే మెట్రో రైలు అందుబాటులోకి వచ్చింది. నగరం నుంచి దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులను కోసం శివార్లలో మరిన్ని రైల్వే స్టేషన్లు అవసరమని భావించారు. నిజాంల కాలం నుంచి ఉన్న హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడకు తోడు.. నలువైపులా రైల్వే స్టేషన్లు నిర్మించాలని నిర్ణయించారు. తూర్పున చర్లపల్లి, పశ్చిమాన నాగులపల్లి, ఉత్తరాన మనోహరాబాద్, దక్షిణాన షాద్‌నగర్ స్టేషన్లను అభివృద్ధి చేస్తే.. ప్రయాణాలు సులభంగా సాగిపోతాయని భావించారు. కానీ వాటిని కార్యరూపం పెట్టడంలో విఫలమయ్యారు. ఇదే సరైన సమయం.. : హైదరాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ ఎంపీ స్థానాలు నగర పరిధిలోకి వస్తాయి. ఈ నియోజకవర్గాల పరిధిలోనే 4 రైల్వే స్టేషన్లున్నాయి. నగర పరిధిలోకి మెదక్ ఎంపీ సీటు కూడా వస్తుంది. మొత్తం 5 మంది ఎంపీలు రాజధానితో ముడిపడి ఉన్నారు. వీరు మిగతా 3 స్టేషన్ల గురించి పట్టు పట్టాల్సిన అవసరముంది. నగరం నలువైపులా 4 స్టేషన్ల నిర్మాణానికిగాను ఒక్క చర్లపల్లిలోనే పనులు పూర్తయ్యాయి. మిగతావాటి ప్రతిపాదనలు రైల్వే బోర్డు వద్ద లేవు. ఈ నాలుగింటిని కలుపుతూ ఎంఎంటీఎస్ రైళ్లు పెంచే అంశంపై ఎంపీలు పట్టుపట్టాలి.

## ఉత్పత్తుల ధరల పెంపు

జగిత్యాల : కేంద్రప్రభుత్వం పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరల(ఎంఎస్‌పీ)ను పెంచగా ప్రభుత్వరంగ సంస్థల సేకరణ, ప్రైవేటుగా ధరల అమలుతోనే అన్నదాతలకు ప్రయోజనం కలగనుంది. ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలంలో 8.50 లక్షల ఎకరాల విస్తీర్ణంతో వరి ప్రధాన పంటగా ఉండగా ప్రభుత్వం ఇన్నాళ్లూ ధాన్యం దొడ్డుగింజ రకాలను కొనుగోలు చేస్తుండగా వచ్చే సీజన్‌లో రూ.500 బోనస్‌తో సన్నగింజ రకాలను కొనుగోలు చేస్తామని ప్రకటించింది. కేంద్రం ధరపెంపు, రాష్ట్రప్రభుత్వ బోనస్‌ను కలుపుకొంటే జిల్లాలోని సాగు అంచనా, సరాసరి దిగుబడిని బట్టి దాదాపుగా రూ.360 కోట్లవరకు రైతులకు అదనపు ప్రయోజనం కలగనుంది.

ఉమ్మడి జిల్లాలో వరి తదుపరి పత్తి రెండో అత్యధిక విస్తీర్ణంలో 1.88 లక్షల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. పత్తిలో సీసీఐ ద్వారా కేవలం 2-18 శాతం పంటనే కొనుగోలు చేస్తుండగా మిగిలిన దూదిని రైతులు మార్కెట్లు, గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తులకు తక్కువ ధరకు విక్రయించి



నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లో దూదికి ధర తగ్గితే సీసీఐ సేకరణ కేంద్రాల సంఖ్యను పెంచాల్సి ఉంది. కేంద్రం కోటా ఇవ్వలేదనే కారణంతో కందులను అత్యంత పరిమితంగానే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుండటంతో రైతులందరికీ మద్దతుధర దక్కటంలేదు. మక్కలకు బయటి మార్కెట్లో ధర తగ్గితే మార్క్‌ఫెడ్ ద్వారా కొనాల్సి ఉంటుంది. వేరుసెనగ, సెనగలు, మినుములు, పెసలు, సోయాబీన్ తదితర ఉత్పత్తుల సేకరణనూ చేపట్టాల్సి ఉంటుంది. పసుపు పంటకు ఈ సీజన్‌లోనూ మద్దతు ధర ప్రకటించనందున విపణి ధరపైనే రైతులు ఆధారపడాల్సి ఉంటుంది. పదేళ్ల తరువాత ఇటీవల పసుపు పంటకు మంచి ధర లభించగా మున్ముందు ధర తగ్గితే పసుపును కూడా గతంలో మాదిరిగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనాలని, గిట్టుబాటుగాని పంటలకు రాష్ట్రప్రభుత్వం బోనస్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. వరికి క్వింటాలుకు రూ.117, మక్కలు రూ.135, పెసర రూ.124, పత్తి రూ.501 చొప్పున ధర పెంచగా విత్తనాలు, ఎరువులు, రసాయన మందుల ధరలు, కూలీలు, యంత్రాల ధరలు భారీగా పెరగటంతో పంటలకు పెంచిన ధరలు అంతగా లాభం కలిగించేలాలేవు. దీనికిగాను మార్కెట్‌లో మద్దతు కన్నా ధర తగ్గినపుడు ప్రభుత్వం మార్కెట్‌జోక్య పథకం ద్వారా పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తే రైతులకు మద్దతు ధరలతో కనీస మొత్తం చేతికంది ఆర్థిక ఆసరా కలుగుతుంది.

## ఇక సమాచార వేదిక..!

నల్గొండ :'రాష్ట్రంలో ప్రస్తుతం 110 కేంద్రాల్లోని రైతు వేదికల నుంచి వీడియో కాన్ఫరెన్సు కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయి. ఈ నెలఖరులోగా మరో456 వేదికల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొస్తాం..'అన్నదాతలు ఎప్పటికప్పుడు వ్యవసాయ సాగునకు సంబంధించి సలహాలు, సూచనలు దృశ్య శ్రవణ విధానంలో వీక్షిస్తూ తెలుసుకునేందుకు ప్రభుత్వం జిల్లాలో ఎంపిక చేసిన ఆరు కేంద్రాల్లో రైతునేస్తం పేరిట శిక్షణ, అవగాహన కార్యక్రమాలను ఈ ఏడాది మార్చి 6న ప్రారంభించింది. అప్పటి నుంచి ప్రతి మంగళవారం నిర్వహిస్తోంది. విత్తనం నుంచి మొదలుకుని పంటల సాగు వరకు జాగ్రత్తలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఆయా పంటల సాగులో ఆచరించాల్సిన నీరు, ఎరువులు తదితర యాజమాన్య పద్ధతులు, యాంత్రీకరణ, వివిధ పంటలకు ఆశించే చీడపీడలు, వాటి నివారణ, సేంద్రియ వ్యవసాయ విధానాలు ఇలా పలు అంశాల్లో వారికి రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు, నిపుణులతో ఆయా పంట కాలాల్లో అవగాహన, శిక్షణ అందిస్తున్నారు. అభ్యుదయ రైతుల అనుభవాలు, సేంద్రియ సాగు విధానాలు ప్రసారం చేస్తున్నారు. ఇప్పటికే నల్గొండ నియోజకవర్గంలోని తిప్పర్తి, సాగర్‌లో త్రిపురారం, నకిరేకల్ చందుపట్ల, దేవరకొండ, మిర్యాలగూడ, మునుగోడు రైతు వేదికల్లో ఎల్ఈడీ, వీడియో కెమెరాలు, స్టాండ్ సిస్టం తదితర సౌకర్యాలు కల్పించి వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా మార్చేసింది.




రైతులందరికీ అందుబాటులో లేవని..

కొన్ని కేంద్రాల్లో రైతునేస్తం దృశ్యశ్రవణం కార్యక్రమాలు జరగడం వల్ల రైతులందరికీ ఈ కార్యక్రమం అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో రైతులు కూడా అంతగా హాజరవడం లేదు. ఈ వేసవిలోనూ అంతంత మాత్రంగానే హాజరు ఉంది. ప్రతి మండలంలోను కనీసం ఒక రైతు వేదికలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అయింది. ఇక జిల్లా వ్యవసాయ శాఖ ప్రతి మండలంలో రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కొన్ని రైతు వేదికలను ఎంపిక చేసింది. ఈ నెలాఖరు వరకూ రాష్ట్రంలో పలు రైతు వేదికల్లో ఈ కార్యక్రమాన్ని అందుబాటులోకి తేగలమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించారు. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

ప్రతి మండలానికి రైతు నేస్తాం ఏర్పాటు..

పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

ప్రతి మండలానికి ఒక రైతు వేదికను ఎంపిక చేసి రైతు నేస్తం సేవలను విస్తరిస్తే ఈ కార్యక్రమానికి రైతుల హాజరు పెరుగుతుంది. ఈ నెల చివరి నాటికి పరికరాలు బిగిస్తాం. రైతుల సంఖ్య పెరుగుతుంది. దీంతో రైతులకు సాంకేతిక సేవలు అందుబాటులోకి వస్తాయి.



# వయనాడ్‌లో ప్రధాని మోదీ.. బాధితులకు పరామర్శ

వయనాడ్: ప్రకృతి ప్రకోపంతో కేరళలోని వయనాడ్ జిల్లా ఇటీవల అతలాకుతలమైన సంగతి తెలిసిందే. కొండచరియలు విరిగిపడి పలు గ్రామాలు నామరూపాల్లేకుండా శిథిలమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం వయనాడ్‌లో పర్యటిస్తున్నారు. ఏరియల్ సర్వే నిర్వహించి విలయం తీవ్రతను తెలుసుకున్నారు. ఈ ఉదయం 11 గంటలకు మోదీ కన్నూర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రధానికి స్వాగతం పలికారు. అనంతరం వీరంతా వాయుసేన హెలికాప్టర్‌లో వయనాడ్‌కు బయల్దేరారు. ఆ మార్గంలోనే కొండచరియలు విరిగిపడి తీవ్రంగా దెబ్బతిన్న ముండక్కై, చురాల్‌మల తదితర ప్రాంతాల్లో ప్రధాని విహంగ వీక్షణం చేశారు. ప్రధాని వెంట కేంద్రమంత్రి సురేశ్ గోపి కూడా ఉన్నారు. కాల్‌పెట్టలో హెలికాప్టర్ దిగిన తర్వాత అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలకు మోదీ చేరుకొని పర్యటించారు. రెస్క్యూ ఆపరేషన్, బాధితుల తరలింపు జరిగిన తీరును అధికారులు ప్రధానికి వివరించారు. సహాయక శిబిరాలు, ఆసుపత్రులకు వెళ్లి బాధితులను మోదీ పరామర్శించరు. అనంతరం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జులై 29-30 తేదీల్లో చోటుచేసుకున్న ఈ ప్రకృతి విపత్తులో కనీసం 226 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ప్రకటించారు. వందల మంది గాయపడగా వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మృతుల సంఖ్య 300లకు పైనే ఉంటుందని అనధికారిక వర్గాల సమాచారం. కొండచరియలు విరిగిపడటంతో వందలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. దీంతో అనేక మంది నిరాశ్రయులయ్యారు.



# అమరావతిలో మహనీయుల జీవిత చరిత్రలతో మ్యూజియం ఏర్పాటు చేయాలి..

బాపట్ల: ఏపీ రాజధాని అమరావతిలో మహనీయుల జీవిత చరిత్రతో మ్యూజియం ఏర్పాటు చేయాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆకాంక్షించారు. మహనీయుల జీవిత చరిత్రలు నేటి తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. జాగర్లమూడిలో మాజీ ఎమ్మెల్యే కుప్పుస్వామి చౌదరి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయనకు ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య.. చీరాల రైల్వేస్టేషన్‌లో ఘనస్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం వెంకయ్య నాయుడు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. నిస్వార్థ సేవా మూర్తి మాజీ ఎమ్మెల్యే కుప్పుస్వామి చౌదరి. దాతృత్వం, మానవత్వం, పాలన దక్షత, స్నేహ సౌరభం కలిగిన వ్యక్తి కుప్పుస్వామి. అన్నదానం కన్నా విద్యా దానం గొప్పదని చెప్పిన మహనీయుడు. అలాంటి వారి గురించి నేటి తరాలకు తెలియాలి. అమరావతిలో వారి చరిత్రలతో మ్యూజియం ఏర్పాటు చేయాలి. ప్రభుత్వాలు సైతం పల్లెల వైపు చూడని సమయంలో గ్రామాల అభివృద్ధికి వారు కృషి చేశారు. రాజకీయ నాయకులకు సానుకూల దృక్పథం ఉండాలి. గత ప్రభుత్వంలో ఏపీ అసెంబ్లీలో బూతులు మాట్లాడారు. అలాంటి వారికి బూత్‌లో ఓట్లు వేయకుండా ప్రజలు బుద్ధి చెప్పారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు హుందాగా వ్యవహరించాలి. రాజకీయాల్లో నేను ఒక్కటే మార్గం.. ఒక్కటే పార్టీలో ముందుకు సాగాను. పిల్లలందరూ అమ్మమ్మ, తాతయ్య, నాయనమ్మలతో గడిపే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. అలా చేస్తేనే వారికి మన సంప్రదాయాలు, విలువలు తెలుస్తాయి.

నా చిన్నతనంలోనే మా అమ్మ గేదె పొడిచి చనిపోయారు. అమ్మమ్మ, తాతయ్యల వద్దే లోకజ్ఞానం నేర్చుకున్నా. తాతతో కలిసి పొలం పనులకు వెళ్లేవాడిని. వ్యవసాయం మన సంస్కృతి, సంప్రదాయం అని తెలిసేలా పిల్లలను తీర్చిదిద్దాలి" అని అన్నారు.

# గతంలో చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ అమలు చేశారు..





న్యూఢిల్లీ: ఎస్సీ వర్గీకరణ తీర్పు రాగానే దక్షణాది రాష్ట్రాలకు చెందిన నలుగురు ముఖ్యమంత్రులు అమలు చేస్తామని చెప్పారని, గతంలో నారా చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణ అమలు చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం జరిగిన టీడీపీ పోలిట్‌బ్యూరో సమావేశంలో కూడా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని సంతోషం వ్యక్తం చేశారు. ఆయనను కలిసి ధన్యవాదాలు తెలుపుతామన్నారు. విదేశీ పర్యటన నుంచి రాగానే సీఎం రేవంత్ రెడ్డిని కూడా కలిసి ధన్యవాదాలు చెబుతామని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. కాగా మందకృష్ణ మాదిగ శుక్రవారం రాత్రి ఢిల్లీలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాను మర్యాదపూర్వకంగా కలిసారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో వారిని కలిసారు. . దాదాపు 30 నిమిషాలపాటు ప్రధానితో భేటీ అయిన మందకృష్ణ ఎస్సీ వర్గీకరణకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే, మంద కృష్ణను ఆప్యాయంగా పలకరించి హత్తుకున్న ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ. తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణ త్వరితగతిన అమలు అయ్యేలా చూడాలని కోరారు. వర్గీకరణ అంశంపై కొందరు సుప్రీం కోర్టుకు వెళ్లే ఆలోచనలో ఉన్న నేపథ్యంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని అన్నారు.

**సుప్రీం తీర్పు..** ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు (%ాబజూతీవఎవ జశీబతీ%) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసే అధికారం.. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. 6:1 మెజారిటీతో సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును వెల్లడించింది.

ఈనెల 1న (గురువారం) వర్గీకరణపై సుదీర్ఘ విచారణ జరిపిన ఏడుగురు సభ్యుల ధర్మాసనం.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ సమర్థనీయమని స్పష్టం చేసింది. కాగా.. ఈ వర్గీకరణను మెజారిటీ సభ్యులు సమర్థించగా.. జస్టిస్ బేలా త్రివేది మాత్రం వ్యతిరేకించారు. ఎస్సీలు చాలా వెనుకబడిన వర్గాలుగా ఉన్నారని.. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల వర్గీకరణ అవసరం ఉందని.. వర్గీకరణచేసే వెసులుబాటు రాష్ట్రాలకు ఉండాలని సుప్రీం స్పష్టం చేసింది. ఈ మేరకు 2004లో ఐదుగురు సభ్యులు ఇచ్చిన తీర్పును తాజా తీర్పు తర్వాత ధర్మాసనం పక్కనబెట్టింది. ఈ తీర్పును అనుసరించి తదుపరి మార్గదర్శకాలను అనుసరించాలని ప్రభుత్వాలకు న్యాయస్థానం సూచించింది.

# తిరుమలలో పవిత్రోత్సవాలు... ఈ తేదీ నుంచే ప్రారంభం



తిరుమల, ఆగస్టు 10: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శించుకుని భక్తులు పరవశించిపోతుంటారు. ఒక్కసారైనా ఆ శ్రీనివాసుడిని దర్శించుకోవాలని తహతహలాడుతుంటారు. అలాగే తిరుమలలో నిత్యం ఉత్సవాలు జరుగుతూనే ఉంటాయి. ప్రస్తుతం తిరుమలలో పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఇందు కోసం టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది. శ్రీవారి ఆలయంలో మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఈనెల 15 నుంచి 17 వరకు ఉత్సవాలు జరుగనున్నాయి. ఉత్సవాల కోసం ఈనెల 14న అంకురార్పణ జరుగనుంది.



# రచ్చకెక్కిన దువ్వాడ ఇంటి గుట్టు..

## ఏం తప్పు చేశానని నాకీ శిక్ష?: వైకాపా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: తన భార్య వాణి అహంకారపూరితంగా వ్యవహరిస్తోందని వైకాపా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. కుమార్తెలకు తనపై ద్వేషం నూరిపోశారని విమర్శించారు. కుటుంబ వివాదం రోడ్డెక్కిన నేపథ్యంలో దువ్వాడ శ్రీనివాస్ మీడియా సమావేశం నిర్వహించారు. "ప్రతి కుటుంబంలోనూ గొడవలు వస్తాయి. వాటిని నాలుగు గోడల మధ్య పరిష్కరించుకోవాలి. రాజకీయం, వ్యాపారరంగాల్లోనూ తానే ఉండాలనే అహంకారం వాణిది. నా కుమార్తెలకు ద్వేషం నూరిపోసింది. నాపైనే ఈర్ష్యా ద్వేషాలు రగిల్చి పిల్లలు నన్నే ప్రశ్నించేలా చేసింది. తండ్రిని ప్రశ్నించమని పిల్లలను తల్లి ప్రేరేపించడమా? నా వ్యాపారం, రాజకీయాల్లో పరిస్థితులు బాగున్నప్పుడే అందులో ఆమెకు ఆధిపత్యం కావాలి. మూలపేట పోర్టు శంకుస్థాపన కార్యక్రమంలో జగన్ నాకు టెక్కలి ఎమ్మెల్యే టికెట్ ప్రకటించారు. ఆ తర్వాత టికెట్ కావాలని అధిష్ఠానం వద్దకు వాణి వెళ్లింది. నాలుగు దఫాలుగా దీనిపై చర్చలు జరిగాయి. టికెట్ ప్రకటించాలని.. నాతో విడాకులు కావాలని పట్టుబట్టింది. లేదంటే విషం తాగుతానని బెదిరించింది.

**రచ్చకెక్కిన దువ్వాడ ఇంటి గుట్టు.. అర్ధరాత్రి ఉద్రిక్తత...** కుటుంబం కోసం జగన్‌కు నచ్చజెప్పి నా టికెట్‌ను వాణికి ప్రకటించాను. నాకే స్వార్థం ఉంటే ఆమెకు టికెట్ ప్రకటిస్తానా? క్షేత్రస్థాయిలో పరిస్థితి వాణికి అనుకూలంగా లేదని తేలడంతో మళ్లీ నాకు టికెట్ ఇచ్చారు. ఆమెకు ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చా.

గ్రానైట్ వ్యాపారంలో ఎంత డబ్బు వస్తే అంత వాణి చేతిలో పెట్టా. ఏనాడూ లెక్క కూడా అడగలేదు. టికెట్ ప్రకటించిన మూడోరోజు నుంచి నన్ను ఇంటికి రానివ్వలేదు.. తాళాలు వేసింది. పాతికేళ్ల వైవాహిక జీవితంలో ఎన్నో అవహేళనలు, అవమానాలు పడ్డాను. నా తల్లిని అనరాని మాటలతో వాణి వేధించింది. నా టికెట్, నా సంపాదన వదులుకున్నాను.. నేనేం తప్పు చేశానని నాకీ శిక్ష? నాకెందుకీ హింస?" అని దువ్వాడ శ్రీనివాస్ ప్రశ్నించారు.



# చీఫ్ జస్టిస్ లక్ష్యంగా బంగ్లాదేశ్‌లో మళ్లీ అల్లర్లు..

బంగ్లాదేశ్‌లో మరోసారి అల్లర్లు చెలరేగాయి. ఈసారి నిరసనకారులు సుప్రీంకోర్టును లక్ష్యంగా చేసుకున్నారు. ప్రధాన న్యాయమూర్తి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఇతర న్యాయమూర్తులు దిగిపోవాలంటూ కోర్టు వద్ద నిరసనలు చేశారు. దాంతో ఆయన దిగొచ్చారు. తాను రాజీనామా చేస్తానని వెల్లడించారు. బంగ్లా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి.. ఇతర న్యాయమూర్తులతో సమావేశానికి పిలుపునిచ్చారు.

అయితే దీనికి తాత్కాలిక ప్రభుత్వం అనుమతి లేదని, అలాగే ఆయన దేశం విడిచి పారిపోవచ్చనే వార్తలతో ఈ నిరసనలు ఒక్కసారిగా చెలరేగాయి. విద్యార్థులతో పాటు పలువురు నిరసనకారులు సుప్రీంకోర్టు వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. దీంతో న్యాయమూర్తుల సమావేశం అర్ధంతరంగా ఆగిపోయింది. అక్కడితో శాంతించని ఆందోళనకారులు కోర్టును చుట్టుముట్టారు. చీఫ్ జస్టిస్ గంటలో దిగిపోవాలంటూ డిమాండ్లు చేయగా.. ఆయన అందుకు అంగీకరించాల్సి వచ్చింది. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. ప్రధానిగా ఉన్న షేక్ హసీనా ఇటీవల వైదొలిగిన విషయం తెలిసిందే. ఆమె ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు దేశాధ్యక్షుడు పార్లమెంటును రద్దు చేశారు. తాత్కాలిక పరిపాలన యంత్రాంగానికి యూనస్‌ను సారథిగా నియమితులయ్యారు. జులై నుంచి దశలవారీగా జరుగుతోన్న ఆందోళనల్లో 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వీటిన వెనక విదేశీ హస్తం ఉందంటూ కథనాలు వెలువడ్డాయి.

**భద్రతపై హామీ ఇవ్వండి: ఆర్మీచీఫ్‌కి బీసీబీ విజ్ఞప్తి...** మరో రెండు నెలల్లో మహిళల టీ20 ప్రపంచకప్ జరగనుంది. అందుకు వేదిక బంగ్లాదేశ్. ఇప్పుడు అక్కడ అల్లర్లు కొనసాగుతూనే ఉండటంపై క్రికెట్ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఈ క్రమంలో ప్లేయర్ల భద్రతపై తమకు హామీ ఇవ్వాలని ఆ దేశ ఆర్మీ చీఫ్‌కు బంగ్లా క్రికెట్ బోర్డు విజ్ఞప్తి చేసింది. ఆర్మీ చీఫ్ వాకెర్ ఉజ్ జమాన్‌కు బీసీబీ లేఖ రాసినట్లు కథనాలు వచ్చాయి. అక్టోబరు 3వ తేదీ నుంచి 20 వరకు పొట్టి కప్ జరగనుంది. సెప్టెంబర్ చివరివారంలో వార్మప్ మ్యాచ్‌ల సందడి మొదలుకానుంది. బంగ్లాదేశ్‌లో పరిస్థితులపై ఐసీసీ కూడా నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఒకవేళ అక్కడ వీలుకాకపోతే.. భారత్‌తోపాటు యూఏఈ, శ్రీలంకను ఇతర ఛాయిస్‌గా ఐసీసీ భావిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.

# సోమశిల ప్రాజెక్ట్ పనులపై వైసీపీని నిలదీసిన ఏపీ మంత్రులు





నెల్లూరు: సోమశిల ప్రాజెక్ట్ హైలెవల్ కెనాల్ పనులను జగన్ ప్రభుత్వం ఎందుకు నిలిపివేసిందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రశ్నించారు. కాంట్రాక్టర్ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయకుండా పారిపోయారని ఆరోపించారు. శనివారం నాడు జెడ్పీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం మీడియాతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వం సోమశిల పనులు చేయలేదు కాబట్టే, తాను ఆ పార్టీ నుంచి బయటకు వచ్చానని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వంలో చాలా పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని అన్నారు.

ఎమ్మెల్యేలతో కలసి స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ముందుకు వస్తే, ఆ పనులను పూర్తి చేయడానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. నెల్లూరు జిల్లాలో 80 శాతం వ్యవసాయ ఆధారిత ప్రాంతమేనని వెల్లడించారు. సోమశిలకు వరద వచ్చి సోమేశ్వర ఆలయం కొట్టుకుపోతే, వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఉద్ఘాటించారు.

**వలంటరీ వ్యవస్థతో పనిలేకుండానే ఫించన్లు...** అభివృద్ధి, పనులు చేసిన వారిని ప్రజలు మరచిపోరని అన్నారు. అభివృద్ధి చేస్తే ప్రజలు పట్టం కడతారని అనడానికి తానే నిదర్శనమని గుర్తుచేశారు. పెన్షన్ల పంపిణీ వలంటరీ వ్యవస్థ ఉంటేనే సాధ్యమవుతుందని జగన్ ప్రభుత్వంలో చెప్పారని.. కానీ కూటమి ప్రభుత్వంలో వలంటరీ వ్యవస్థతో పనిలేకుండానే ఫించన్లు పంపిణీ చేసి చూపించామని గుర్తుచేశారు. సినరీస్ సెస్‌ను బలోపేతం చేసి స్థానిక సంస్థలకు నిధులు వచ్చేలా చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు.

స్థానిక సంస్థలను బలోపేతం చేయడానికి చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. వచ్చే ఐఏబీ సమావేశంలోపు పూర్తి స్థాయిలో ఆయకట్టు వివరాలు సేకరిస్తామని తెలిపారు. పోలవరాన్ని త్వరలో పూర్తి చేసి ఏపీని సస్యశ్యామలం చేసేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో అన్నమయ్య డ్యామ్, సోమశిల డ్యామ్ కింది భాగాలు కొట్టుకుపోతే దిక్కులేకుండా పోయిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలకు ఇంకా రెండున్నారేళ్లు సమయం ఉందని... రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తామని మంత్రి ఆనం రామానారాయణ రెడ్డి వెల్లడించారు.

**పనులు చేయకుండా బిల్లుల వసూళ్లు: మంత్రి నారాయణ** - వైసీపీ ప్రభుత్వం సోమశిల హైలెవల్ కెనాల్ పనులను నిలిపివేసిందని మంత్రి నారాయణ తెలిపారు. శనివారం నాడు జెడ్పీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం మీడియాతో మంత్రి నారాయణ మాట్లాడారు. జిల్లాలో అన్ని సమస్యలపై చర్చించామని అన్నారు. 1950 ఆయకట్టు ఆధారంగానే నీటి విడుదల జరుగుతుందని తెలిపారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు.

జిల్లాలో స్టిల్ తీయకుండానే బిల్లులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని.. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

**మూడు లక్షల ఎకరాలు బీడు: ఎమ్మెల్యే సోమిరెడ్డి...** కండలేరు ఆయకట్టు 2.20 లక్షల ఎకరాలు 2019 వరకు ఉండగా, గత ఐదేళ్లలో ఒక్క ఎకరానికి కూడా ఆయకట్టు పెరగలేదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. గతేడాది రైతులు మూడు లక్షల ఎకరాల పొలాలను బీడుగా పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లస్కర్లకు జీతాలు లేవని, కాలువల్లో పూడికలు, బురద తీయలేదని చెప్పారు. జనవరిలో సర్వేపల్లిలో పనులు చేయకుండానే బిల్లులు చేసుకున్నారని తన దగ్గర ఆధారాలు ఉన్నాయని చెప్పారు. గ్రామాల్లో పనులు చేశారో, లేదో రైతులనే అడగాలని కలెక్టర్‌ని కోరారు. రెండేళ్ల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఆరు నెలలకి ఎందుకు తగ్గించారు? అని ప్రశ్నించారు. రైతుల ఊసురు పోసుకున్న ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదని మండిపడ్డారు. చెరువులో కట్టిన జగనన్న కాలనీల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని అన్నారు. రైతులను వేధించి, హింసించి, బాధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు.

గరుడ వార్త



## చక్కనమ్మ ఇంకా చిక్కిందా?

ఉత్తరాది ముద్దుగుమ్మ ప్రగ్యా జైస్వాల్ 2014 లో తమిళ చిత్రం విరాటు తో నటిగా పరిచయం అయిన విషయం తెల్సిందే. తెలుగు లో ఈ అమ్మడు చేసిన కంచె సినిమాతో ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించింది. తెలుగు తో పాటు ఇతర భాషల్లో కూడా ఆ మూవీ మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఆ సమయంలో అన్ని భాషల ప్రేక్షకులు ప్రగ్యా జైస్వాల్ గురించి మాట్లాడుకోవడం జరిగింది. చాలా పద్దతిగా, హుందాగా ఆ సినిమాలో సీతా దేవి పాత్రలో నటించడం ద్వారా అన్ని వర్గాల ప్రేక్షకులను ప్రగ్యా ఆకట్టుకున్న విషయం తెల్సిందే. కంచె తో వచ్చిన గుర్తింపు తో ప్రగ్యా జైస్వాల్ కి వరుసగా ఆఫర్లు వచ్చాయి. కానీ కాలం కలిసి రాకపోవడంతో కంచె తర్వాత ఆ స్థాయి విజయాన్ని ఈ అమ్మడు దక్కించుకోలేక పోయింది. ఆ మధ్య బాలకృష్ణ కు జోడీగా ప్రగ్యా జైస్వాల్ అఖండ సినిమాలో నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకున్నా కూడా ప్రగ్యా జైస్వాల్ కెరీర్ కి గొప్ప టర్నింగ్ పాయింట్ గా మాత్రం మిగలలేదు. అంతే కాకుండా ఆ సినిమా వల్ల ఆఫర్లు కూడా రాలేదు. ప్రస్తుతం ప్రగ్యా జైస్వాల్ మరో విజయం కోసం ఎదురు చూస్తోంది. సినిమా ఇండస్ట్రీలో ఆఫర్లు పెద్దగా రాకున్నా కూడా సోషల్ మీడియాలో అందాల ఫోటోలు షేర్ చేయడం ద్వారా రెగ్యులర్ గా వార్తల్లో నిలవడంతో పాటు ట్రెండ్ అవుతూ ఉంటుంది.



ఈమె అందాల ఫోటోల కారణంగా ఆఫర్లు అప్పుడప్పుడు తలుపు తడుతూనే ఉన్నాయి. సాధారణంగానే ప్రగ్యా జైస్వాల్ సన్నగా నాజూకుగా ఉంటుంది అనే టాక్ ఉంది. అలాంటి ప్రగ్యా ఇంకా సన్నబడింది అనే టాక్ వినిపిస్తోంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఈ అందాల ఫోటోలకు నెటిజన్స్ ఎక్కువ శాతం మంది ప్రగ్యా మరింత సన్నబడింది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. విభిన్నమైన ఔట్ ఫిట్ తో ప్రగ్యా మరోసారి ఆకట్టుకుంది. అయితే ఈసారి ఫుల్ టైట్ టీ షర్ట్ ధరించడం వల్ల మరింత సన్నగా ఉంది అన్నట్లుగా చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బ్లాక్ జీన్స్ ధరించిన ప్రగ్యా డిఫరెంట్ టాప్ తో చూపరుల దృష్టిని ఆకర్షించింది. హెయిర్ లీవ్ చేసి, ప్రగ్యా జైస్వాల్ ఇచ్చిన ఫోటో ఫోజ్ లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ స్థాయి అందాల ఆరబోత గతంలో ఎన్నో సార్లు ప్రగ్యా సోషల్ మీడియాలో చేసింది. అయినా కూడా నెటిజన్స్ మాత్రం ఈ ఫోటోలను చాలా స్పెషల్ గా చూస్తున్నారు.

చక్కనమ్మ చిక్కినా చాలా అందంగా ఉంది అన్నట్లుగా పలువురు కామెంట్స్ చేస్తూ ప్రగ్యా పై తమకు ఉన్న అభిమానం ను లైక్స్ మరియు షేర్స్ రూపంలో తెలియజేస్తున్నారు. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి నిరూపితం అయ్యిందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న ప్రగ్యా జైస్వాల్ కి ఇకపై అయినా వరుసగా ఆఫర్లు రావాలని ఫ్యాన్స్ మరియు ప్రేక్షకులు కోరుకుంటున్నారు.

## ఆ హీరో నిర్ణయం భార్య చేతిలోనా?


భార్య చెబితే వినకూడదు అనే వర్గంతో పాటు అదే భార్య మాట వింటే తప్పేంటి? అన్నవారు లేకపోలేదు. భర్త జీవితంలో సగభాగం భార్య. అలాంటప్పుడు వింటే తప్పేముంది? అనడంలో తప్పేంలేదు కదా. అక్కినేని అమల ఛారిటీ చేస్తోన్న సంపాదన అంతా నాగార్జునదే అన్నది అందరికీ తెలుసు. ఎన్ని సర్వీసులైనా చేస్తుంది? ఎందుకంటే చెక్కులు మీద సంతకం పెట్టేది నేను కదా? అని ఓ సందర్భంలో సరదగా అన్నారు. సూపర్ స్టార్ మహేష్ సైతం భార్యని ఎలా మ్యానేజ్ చేయాలో ఓ టెక్నిక్ చెప్పారు. ఏం లేదు? భార్యని చూసినప్పుడల్లా కోప్పడకుంటా నవ్వుతుంటే సరిపోతుంది. అంతకు మించి మనమేం చేయాల్సిన పనిలేదన్నారు. మెగాస్టార్ చిరంజీవి సైతం బయట పులి అయినా ఇంట్లో మాత్రం ప్రతీ మగాడు పిల్లే అన్నట్లు సరదాగా వ్యాఖ్యానించిన సందర్భం ఉంది. ఇలా ఉండటంలో తప్పేముంది? ఒంటెద్దు పోకడతో ఉంటేనే సమస్యలన్నీ వస్తాయన్నారు.



తాజాగా కోలీవుడ్ స్టార్ సూర్య కూడా ఇదే లిస్ట్ లో ఉన్నట్లు తెలుస్తోంది. సూర్య ఏ పని చేయాలి అన్న ముందుగా జ్యోతిక అనుమతి తీసుకుంటాడుట. తాను సొంతంగా ఓ నిర్ణయం తీసుకున్న తర్వాత దాన్ని జ్యోతిక ముందు ఉంచుతాడుట. అటుపై ఇద్దరు దాని మీద సమగ్రంగా తప్పొప్పులను విశ్లేషించుకుని ఓ నిర్ణయానికి వస్తారుట. ప్రతీసారి సొంత నిర్ణయాలు మంచిది కాదని అంటున్నారు. తీసుకోవాల్సిన సమయం వచ్చినప్పుడు సొంత నిర్ణయాలు తీసుకుని..వీలు కుదిరిప్పుడల్లా వాటిని భార్య ముందుకు తీసుకెళ్తాడుట. ఆ విషయంలో జ్యోతిక ఎంతో సహకరిస్తుందిట. సరైన నిర్ణయం అయితే తనకన్నా ముందే ఆ పని తానే చేసేస్తుందిట. ఇప్పటివరకూ తన నిర్ణయాలేవి తప్పలేదని అంటున్నారు. ప్రస్తుతం సూర్య పీరియాడిక్ చిత్రం %-%కంగువ%-%తో ప్రేక్షకల ముందుకు రావడానికి రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న సినిమా పోస్ట్ ప్రొడక్షన పనుల్లో ఉంది.




## పుష్ప రాజ్ ను ఢీకొట్టాలంటే ఈమాత్రం ఉండాలి




స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'పుష్ప: ది రూల్' పై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకునేలా రూపొందుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషనల్ కంటెంట్ ఇప్పటికే ప్రేక్షకులలో పాజిటివ్ వైబ్రేషన్స్ క్రియేగ్ చేసింది. టీజర్ విడుదలైనప్పటి నుంచి సినిమా మీద మరింత ఆసక్తి పెరిగింది. ఇక సినిమాలో ప్రముఖ నటుడు ఫహాద్ ఫాసిల్ కీలకమైన పోలీస్ ఆఫీసర్ భన్వర్ సింగ్ షేకావత్ పాత్రలో కనిపించనున్నారు. సుకుమార్ రచనలో ఈసారి ఈ విలన్ మరింత పవర్ఫుల్ గా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ పాత్రపై ప్రేక్షకులలో ప్రత్యేక ఆసక్తి నెలకొన్నది. ఫహాద్ ఫాసిల్ నటనకు మంచి గుర్తింపు ఉన్న నేపథ్యంలో, ఈ సినిమాలో అతని పాత్ర మరింత మలుపులు తిరిగేలా ఉండబోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక ఫహాద్ పుట్టిన రోజు సందర్భంగా విడుదలైన తాజా పోస్టర్ లో ఆయన ప్రతినాయకులకు భయపెట్టే రీతిలో కనిపిస్తున్నారు. ఒక చేతిలో గన్ను మరో చేతిలో గొడ్డలి పట్టుకొని ఉన్నాడు. ఈ పాత్ర మొదటి భాగంలో ఎంత విలక్షణంగా ఉందో, రెండవ భాగంలో కూడా అంతే డైనమిక్ గా ఉండబోతోందని అంచనాలు ఉన్నాయి. సుకుమార్, ఫహాద్ పాత్రను చాలా ఊహించలేని సన్నివేశాలతో నిండింపచేస్తున్నారని సమాచారం.


## రవితేజ- శ్రీలీల.. ఈసారి కాస్త కొత్తగా..



టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ.. ఈ ఏడాదిలో ఇప్పటికే ఈగల్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. యాక్షన్ థ్రిల్లర్ గా కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కించిన ఈ మూవీ.. మోస్తరు వసూళ్లను రాబట్టింది. కానీ సినిమాలో రవితేజ గెటప్ తో పాటు యాక్షన్ సీక్వెన్స్, ఆయన యాక్టింగ్ హైలైట్ గా నిలిచాయి. ఆ తర్వాత రెండు ఓటీటీ ప్లాట్?ఫామ్స్ ల్లో మూవీ స్ట్రీమింగ్ అవ్వడం విశేషం ప్రస్తుతం రవితేజ.. ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ డైరెక్షన్ లో మిస్టర్ బచ్చన్ మూవీ చేస్తున్న సంగతి కూడా తెలిసిందే. కొన్ని రోజులుగా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. బాలీవుడ్ సూపర్ హిట్ మూవీ రైడ్ కు రీమేక్ గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రవితేజ అమితాబ్ ఫ్యాన్ గా కనిపించనున్నారు. త్వరలో రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేయనున్నారు. అయితే రీసెంట్ గా రవితేజ.. తన ల్యాండ్ మార్క్ 75వ మూవీని ప్రకటించారు. గత ఏడాది వచ్చి సూపర్ హిట్ అయిన సామజవరగమన మూవీ రచయిత భాను భోగవరపు ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ఇటీవల పూజ కార్యక్రమాలు కూడా జరిగాయి. యంగ్ బ్యూటీ శ్రీలీలను హీరోయిన్ గా ఫిక్స్ చేశారు మేకర్స్. పూజ కార్యక్రమాల రోజు ఆరంజ్ కలర్ శారీ లో మెరిసిపోయింది అమ్మడు. ఇప్పుడు ఈ మూవీ పీరియాడిక్ జోనర్ లో రూపొందనుందని జోరుగా ప్రచారం సాగుతోంది. అరకు అటవీ బ్యాక్ డ్రాప్ లో సినిమా తెరకెక్కుతుందని సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమాను త్వరలోనే సెట్స్ పైకి తీసుకెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పీరియాడిక్ జోనర్ లో పలు సినిమాలు చేసిన రవితేజ.. మరో మూవీ చేస్తారని వార్తలు రావడంతో ఆసక్తి నెలకొంది. మరోవైపు, రవితేజ, శ్రీలీల కలిసి ధమాకా మూవీలో నటించి అదరగొట్టారు. హిట్ పెయిర్ గా పేరు సంపాదించుకున్నారు. ఇప్పుడు మళ్లీ కలిసి నటిస్తుండడంతో అంచనాలు క్రియేట్ అవుతున్నాయి. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై యంగ్ డైరెక్టర్ నాగ వంశీ ఈ మూవీని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం రిలీజ్ అయ్యేందుకు సిద్ధమవుతోంది. త్వరలోనే మరిన్ని వివరాలు ప్రకటించనున్నారు మేకర్స్.

## కృతి సనోన్.. ఆ నడములోనే అసలు మాయ

అందానికి అభినయానికి డాన్స్ తోడైతే అలాంటి భామలు తక్కువ టైంలోనే సినిమా ఇండస్ట్రీలో సక్సెస్ అవుతారు. స్టార్ హీరోయిన్స్ గా మారిపోయి వరుస ఛాన్స్ లు అందుకుంటారు. అయితే అందం మాత్రమే ఉండి మిగిలిన వాటిలో టాలెంట్ లేకపోతే ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోవడం కష్టమే. అందంతో తో పాటు డాన్స్ టాలెంట్ మాత్రమే ఉంటే ఐటెం సాంగ్స్ లో అవకాశాలు అందుకుంటారు. వీరిలో మొదటి కేటగిరీలో ఉండే బ్యూటీ కృతి సనోన్. కృతి సనన్ మొదటి సినిమానే తెలుగులో సూపర్ స్టార్ మహేష్ బాబుకి జోడీగా నేనొక్కడినే చిత్రంలో చేసింది. అయితే ఈ మూవీ కమర్షియల్ గా సక్సెస్ కాలేదు. సినిమాలో కృతి సనన్ కి మంచి పెర్ఫార్మెన్స్ కి స్కోప్ ఉన్న క్యారెక్టర్ దొరికింది. తరువాత హీరోపంతి సినిమాతో కృతి బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. ఆ సినిమా హిట్ అయ్యింది. మరల తెలుగులో దోచేయ్ సినిమాలో నాగ చైతన్యతో జతకట్టింది. ఆ మూవీ వర్క్ అవుట్ కాలేదు. హిందీలో చేసిన రెండో సినిమా దిల్ వాలే బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఆ సినిమాతో స్టార్




హీరోయిన్ గా మారిపోయిన కృతి సనన్ కి తరువాత వరుసగా అవకాశాలు వచ్చి పడ్డాయి. సక్సెస్, ఫెయిల్యూర్ తో సంబంధం లేకుండా బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్స్ లలో ఒకరుగా కృతి దూసుకుపోతోంది. గత ఏడాది ఆదిపురుష్ తో డిజాస్టర్ అందుకున్న ఈ బ్యూటీ 2024లో మాత్రమే తేరీ బాతోన్ మే ఐసా ఉలా జియా, క్రూ సినిమాలతో రెండు హిట్స్ అందుకుంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ బ్యూటీ ఫిల్మ్ ఫేర్ మ్యాగజైన్ కవర్ పేజీపై మెరిసింది. ఈ మ్యాగజైన్ పై డార్క్ బ్లూ కలర్ అవుట్ ఫిట్ తో కృతి సనన్ లుక్స్ స్టన్నింగ్ గా ఉన్నాయనే మాట వినిపిస్తోంది. ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కుర్రాళ్ళ కలల దేవతలా ఈ రూపంలో కృతి సనన్ ఉందనే మాట సోషల్ మీడియాలో వినిపిస్తోంది. ఆదిపురుష్ మూవీ డిజాస్టర్ కాకుండా ఉండుంటే నెక్ట్స్ పాన్ ఇండియా హీరోయిన్ గా కృతి సనన్ మారేదనే ఆమె ఫ్యాన్స్ అంటున్నారు.

## హార్ట్ మెల్ట్ అయ్యేలా ఈ లుక్కేంటి శ్రీవల్లి

రష్మిక మందన్న గ్లామర్ తోనే కాకుండా నటనతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ప్రతి ఏడాది ఏదో ఒక సినిమాతో ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటూ, బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. రష్మిక జోరు ఏ మాత్రం తగ్గడం లేదు. తక్కువ బడ్జెట్ సినిమాల నుంచి భారీ బడ్జెట్ సినిమాల వరకు, కంటెంట్ ఉన్న కథలు ఎంచుకుంటూ తన నటనలో వైవిధ్యాన్ని చూపిస్తోంది. అన్ని వర్గాల్లో తనకంటూ మంచి క్రేజ్ సంపాదించుకోవడానికి రష్మిక చేస్తున్న ప్రయత్నాలు విశేషంగా ఉన్నాయి. సౌత్ ఇండియన్ సినిమాల్లో మాత్రమే కాకుండా, బాలీవుడ్ లో కూడా మంచి గుర్తింపు తెచ్చుకుంది. తొందరగానే అక్కడ కూడా పెద్ద విజయాలను చూసిన రష్మిక, ఇంకా పెద్ద ఎత్తున సక్సెస్ అందుకోవడానికి సిద్ధమవుతోంది. అంతేకాదు, పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్ లో కూడా పాల్గొంటూ తన పేరు, ప్రఖ్యాతిని పెంచుకుంటోంది. సోషల్ మీడియాలో కూడా అమ్మడు తన గ్లామర్ తో కుర్రాళ్ల మనసు దోచేస్తోంది. రీసెంట్ గా శ్రీవల్లి వర్కౌట్ చేసిన తరువాత ఓ రెండు ఫోటోలు అలా వదిలింది. ఇక అందులో ఫిట్నెస్ తోనే షాక్ ఇచ్చింది. ఇక కొంటెగా నవ్వుతూ హార్ట్ మెల్ట్ అయ్యేలా చేసిందని ఫాలోవర్స్ పాజిటివ్ గా రియాక్ట్



అవుతున్నారు. రష్మిక ఈ ఫోటోలలో గ్లామర్ తో పాటు సింపుల్ గా క్యూట్ గా కనిపిస్తూ, అభిమానులను ఆకట్టుకుంది. రష్మిక మునుముందు కూడా స్టార్ హీరోయిన్ గా ఎదుగుతుందని, ఆమె క్రేజ్ ఇంకా పెరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'పుష్ప: ది రూల్' సెకండ్ పార్ట్ లో రష్మిక నటిస్తుండటంతో ఆ సినిమా పైన భారీ అంచనాలు ఉన్నాయి. అలాగే, బాలీవుడ్ లో కూడా రెండు సినిమాలు చేస్తున్న రష్మిక, అక్కడ తన మార్క్ చూపించడానికి సిద్ధమవుతోంది. 2016లో 'కిరాక్ పార్టీ' సినిమాతో మొదలైన ఆమె సినీ ప్రయాణం, ప్రతీ ఏడాది కూడా మరింత పటిష్టంగా కొనసాగుతోంది. గత ఏడాది 'వారిసు', 'మిషన్ మజ్ను', 'యానిమల్' వంటి సినిమాల్లో నటించి, మంచి విజయాలను అందుకుంది. 'యానిమల్' సినిమా బిగ్గెస్ట్ హిట్ గా నిలవగా, 'వారిసు' మంచి కమర్షియల్ సక్సెస్ ను అందించింది. రష్మిక, ప్రస్తుతం 'పుష్ప 2' తో పాటు, 'రెయిన్ బో' అనే లేడీ ఓరియంటెడ్ ప్రాజెక్ట్ లో నటిస్తోంది. అలాగే, 'ది గర్ల్ ఫ్రెండ్' అనే సినిమా కూడా సెట్స్ పై ఉంది. సినిమాలతో పాటు, సోషల్ మీడియాలో కూడా ఎప్పటికప్పుడు తన క్రేజ్ పెంచుకునే ప్రయత్నం చేస్తుంది.

